
# మిసిమి

మాస పత్రిక

ఫిబ్రవరి-2004



రూ. 8/-

## చిత్రకారుని గురించి



సూర్య ప్రకాష్

1940లో జన్మించిన సూర్యప్రకాష్, 1961వ సంవత్సరంలో లలిత కళలలో డిప్లొమా పొంది ప్రఖ్యాత బెంగాలీ చిత్రకారుడయిన శ్రీ రామ్ కుమార్ వద్ద ఢిల్లీలో శిక్షణ పొందారు. 1970వ దశకం నుంచి తనదైన ఒక విన్నూత్న శైలిని అలవరచుకొని 1980లోనే దేశంలోని అత్యున్నత చిత్రకారులలో ఒకరిగా లలితకళా అకాడమీ, న్యూఢిల్లీ వారిచే ఎన్నుకోబడ్డారు. భారత దేశపు అన్ని ప్రధాన నగరాలతో బాటు విదేశాలలో సైతం వారి చిత్ర ప్రదర్శనలు జరిగాయి.

ఫ్రెంచి దేశపు ఇంప్రెషనిష్టులయిన క్లాడ్ మోనెట్, సెజెన్‌లు ఆయనకు స్ఫూర్తి ప్రదాతలు. గత ముప్పై ఐదు సంవత్సరాల నుంచి అప్రతిహతంగా సాగుతున్న కళా విన్యాసంలో ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన మొదటి కళాగుచ్ఛం "రాలిపోతున్న ఎండుటాకులు" (The Flight of Leaves) అనే చిత్ర పరంపం. దానికి కొనసాగింపుగా సాగిన "బింబప్రతిబింబాలు" (Reflections). ఆ తరువాత "కలువలతో నిండిన జలాశయం (Pool of life) మొదలైన దృశ్య మాలికలు నవీన భావంగల చిత్రకారులలో ఆయన స్థానాన్ని పదిలపరిచాయి.

సూర్య ప్రకాష్ ఒక కళాస్రష్ఠ మాత్రమే కాదు, చిత్రకళకు సంబంధించి ఒక కళాప్రవక్త కూడా. హైదరాబాద్‌లోని సి.సి.ఎం.బి (Centre for Cellular & Molecular Biology), శ్రీ ఎల్.వి. ప్రసాద్ వారి నేత్ర చికిత్సాలయములోని ప్రదర్శన శాలలు వారి పర్యవేక్షణలో భాగ్యనగరంలో అత్యున్నతమైనవిగా రూపు దిద్దుకున్నాయి. 1970 నుంచి ఈ నాటివరకూ భాగ్యనగర వవాసులకు భారత దేశంలోని వివిధ కళారీతులను, కళా శైలులనూ ప్రతిబింబించే అనేకానేక ప్రఖ్యాత చిత్రకారులను పరిచయం చేసి, కళాప్రదర్శనలు గావించి కళాజగత్తుని సుసంపన్నం చేసిన కళాజీవి ఆయన.

ఆయన చిత్రాలు ఈనాడు మన దేశంలోనే కాక, జర్మనీ, ఫ్రాన్స్, అమెరికాలాంటి దేశాలలో ఉన్న అనేక మంది కళాపోషకుల గృహాలనలంకరించాయి.

బంజారాహిల్స్‌లోని తన ఇంటిని కూడా ఒక కళాక్షేత్రంగా మార్చుకొన్న సూర్యప్రకాష్‌కు అన్ని విధాల తోడ్పాటునిచ్చే అర్ధాంగి శ్రీమతి ప్రభ, కుమార్తె శ్రీమతి కిరణ్‌లు ఉండటం ముదావహం.

**ముఖచిత్రం : ప్రకృతి కన్న కల**

రాతి గుహ మానవుల నుంచి బౌద్ధుల వరకు తర తరాలుగా వారి వారి యుగాల కళలతో జీవించారు. సహస్రాబ్దాలు గడిచినా, మన కాలంలో, మన నిత్య జీవితంలో వాటికి ఒకింత స్థానం కల్పించడానికి పెనుగులాగుతూనే ఉన్నాం. మన ఇళ్ళల్లో, ఫ్యాక్టరీలలో, ఆసుపత్రులలో మన దైనందిన జీవితంలో ఎక్కడ అధిక భాగాన్ని గడిపితే అక్కడ కళను ఒకింత మననిస్తే, కళ నాకు తెలియదు" అనే దానికి అర్థం ఉండదు. బదులుగా మనం కళను అనుభూతి చెందుతున్నామంటాం"

(మూడవ, నాలుగవ అట్టలపై చిత్రాలు కూడ వీరివే)

- కాండ్రేగుల నాగేశ్వరరావు

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 15 ఫి|బ్రవరి 2004 సంచిక 2

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

ఇరవయ్యో శతాబ్ది మనస్సు గతి - II - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

సెల్మా ఒట్టిలియానా లోవిసా లాజర్లోఫ్ మూలం : క్లౌస్ అన్‌స్టైట్
అనువాదం : బి.వి. రామిరెడ్డి

స్నేహ సారము - డా॥ యు.ఏ. నరసింహమూర్తి

రుచి - వింజనంపాటి రాఘవరావు

సమసమాజంలో మానవాత్మ మూలం : ఆస్కార్‌వైల్డ్
అనువాదం : సర్దేశాయి తిరుమల రావు

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **"ప్రకృతి కన్న కల"**

చిత్రకారుడు : **సూర్యప్రకాష్**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# జ్ఞాపకం

మనుషులు తమ భావాల పటిమి ఆధారంగా నిలుస్తారు. ఆలపాటి రవీంద్రనాథ్ భావాలు బలమైనవి. అందుకే అటువంటి ఆయన భావాల పునాదిపై నిలిచిన **'మిసిమి'**, తన పునాదులను మరిచి పోకుండానే, ఆయనను దాటి ఎనిమిదేళ్ళు నిలవగలిగింది.

బాల్యం పదునాలుగేళ్ళు దాటి పదిహేనవ ఏట ప్రవేశించింది **'మిసిమి'**. వయస్సుకు ముందే ప్రౌఢ అయిందంటారు కొందరు. వయసు తక్కువే అయినా అణకువ, మెలకువ, ఒబ్బిడి, ఎరుక, స్వీయ జాగరూకతలతో సంస్కృతీ - సాహితీ - మేధో ఆకాశ కాన్వాసు మీద తన పద, పథ రేఖలను చిత్రించుకొంటూ అప్రతిహతంగా ప్రగమిస్తోంది. అది తొక్కే బాట ఎవరూ మెట్టని బాట. రాజకీయులకు గాని మరెవరికి గాని బాకాలూదని, మసాళాలు లేని, దురదలు రేకెత్తించని, ఆలోచనా అలవాటు మత్తును విదిలించే, అనుక్షణ అప్రమత్తతో అదిలించే బాట దానిది.

ఈ పదునాలుగేళ్ళుగా పాఠకులు, విమర్శకులు, అభిమానులు కురిపించే మెప్పుకోళ్ళు, తిట్టుకోళ్ళును, సమదృష్టితోనే స్వీకరిస్తోంది **'మిసిమి'**. తదనుగుణంగా, మూలరూపం (వ్యవస్థాపక సంపాదకులు ఆలపాటి రాసిన) నుంచి విచలించకుండ **'మిసిమి'** సాకారం పొందుతూ వారందరికీ కృతజ్ఞతలు తెలుపు కొంటోంది. ఇన్నేళ్ళు మిసిమిని 'చూసిన' పాఠక రచయితలు దానిలో ఇమిడే విధంగా రచనలు చేసి పంపవలసిందిగా **'మిసిమి'** అభ్యర్థిస్తోంది.

ఆలపాటి కాలం చేసింది 1996 ఫిబ్రవరి, 11. వారి జ్ఞాపకానికి **'మిసిమి'** కన్నీటి బొట్లు, దుఃఖంతో కాదు, కృతజ్ఞతతో.

# ఇరవయ్యో శతాబ్ది మనస్సు గతి - II

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ఒక సమస్య ఉంది. దానికి ఉన్న పరిష్కారం ఒకటే. కాని ఆ సమస్యతో తలపడిన వారిలో ఒకడు దానితో కుస్తీ పడతాడు, మరొకడు రాజీ పడతాడు, వేరొకడు దాని నుంచి పారిపోతాడు, మరొకడు దానికి లొంగిపోతాడు. పరిష్కారం ఒకటే అయినప్పుడు వివిధ వ్యక్తులు దానిని వివిధంగా పరిష్కరించారు. ఇలా ఎందుకు జరిగింది? దీనికి సమాధానం వారి వారి మూర్తిమత్వాలే (Personalities). మూర్తిమత్వం అంటే ఒక వ్యక్తి శీల లక్షణ మనదగిన విస్పష్టస్థిర ప్రవర్తన నమూనా, ఆలోచనలు, ప్రేరణలు, ఉద్వేగాలు.

ఇటువంటి మూర్తిమత్వాన్ని గురించి సైకాలజిస్టులు ఎవరి తరహా సిద్ధాంతాన్ని వారు ప్రతిపాదించారు. అలా ప్రతిపాదించిన సిద్ధాంతాలలో అత్యంతంగా ప్రచలితమైంది ఫ్రాయిడ్ సిద్ధాంతం. ఫ్రాయిడ్ సిద్ధాంతం ఒక మహా విప్లవాన్ని తెచ్చింది.

అసలు ఆధునిక యుగాన్ని ఊపి వేసిన విప్లవాలు మూడు ఉన్నాయి. వాటిల్లో మొదటిది కోపర్నికస్ విప్లవం. ఈ విశ్వానికి భూమి కేంద్రమనే పాత సిద్ధాంతాన్ని కాదని, సౌర కేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తుంది ఈ విప్లవం. రెండోది డార్విన్ తెచ్చిన విప్లవం. తతిమ్మా సృష్టితో పాటుకాకుండా, మనిషిని వేరుగా దేవుడు సృష్టించాడనే బైబిల్ సిద్ధాంతాన్ని కాదని, నరుడు వానరంనుంచి వచ్చాడని డార్విన్ పరిణామ సిద్ధాంతం పతిపాదిస్తుంది. మూడో విప్లవం ఫ్రాయిడ్ తెచ్చింది. ఫ్రాయిడ్‌కు ముందు అందరూ మనస్సులోని చేతనకు పెద్దపీట వేశారు. ఫ్రాయిడ్ వచ్చి ఈ పీట మీద నుంచి చేతనను లాగి వేసి అచేతనను కూచోబెట్టాడు. మనస్సు నీళ్ళల్లో తేలే మంచు గడ్డ అని అనుకొంటే, నీటిపైన తేలి కనిపించే మంచు గడ్డ భాగానికి చేతన భాగం సమానం అనీ, నీటిలో మునిగి ఉన్న మూడు వంతుల మంచు గడ్డకు అచేతన భాగం సమానమనీ, చెప్పాడు ఫ్రాయిడ్. అంటే మనస్సును - మన ప్రవర్తనను - ఎక్కువగా ప్రభావితం చేసేది ఈ అచేతనే భాగమే. ఈ అచేతన భాగాన్ని విశ్లేషించి, దాని లోతులను కొలవడమే మనో విశ్లేషణ. ఈ ప్రక్రియను ఒక విధానంగాను ఒక సిద్ధాంతంగాను చూడవచ్చు. సిద్ధాంతంగా చూసినప్పుడు ఇది ఒక మూర్తిమత్వ సిద్ధాంతం అవుతుంది.

మనుష్యుల్లో చిత్రాతి చిత్రమైన వ్యక్తులుంటారు. ఒక కోటీశ్వరుడు బలపాలు, పెన్సిళ్ళు దొంగిలిస్తాడు. ఒకడు తను ప్రేమించిన యువతి అందమైన బుగ్గలమీద బ్లేడుతో గాట్లు పెడతాడు. మరొకడు స్త్రీల పాదాలను ముద్దు పెట్టుకొంటాడు. 'అందరి కళ్ళూ నీ మీదే, నీ అందాన్ని చూసి అందరూ మైమరుస్తున్నారు. అని ఆమె ప్రియుడన్నప్పుడు, ఆ ప్రేయసి ముఖం మీద గాట్లు పెట్టుకొంది. ప్రఖ్యాత రచయిత హెమింగ్వే ఆత్మహత్య చేసుకొన్నాడు. ప్రఖ్యాత చిత్రకారుడు వాన్‌గాగ్ తన చెవిని కోసి ఒక వేశ్యకు పంపాడు. ఇరవై ఒక్క ముఖాలున్న స్త్రీ కథను మనం చూశాం. ఈ ప్రవర్తనల మీద ఫ్రాయిడ్ సిద్ధాంతం వెలుగు ప్రసరించింది. కారణాలను అచేతనంలో చూడాలంది.

ఫ్రాయిడ్ మూర్తిమత్వ సిద్ధాంతం ప్రకారం, మూర్తిమత్వంలో ఇడ్, ఈగో, సూపర్ ఈగోలనే మూడు వ్యవస్థలుంటాయి. ఈ మూడు వ్యవస్థలలో దేని మూలకాలు, ప్రకార్యాలు దానికి ఉన్నా, వ్యక్తి ప్రవర్తన ఈ మూడింటి మధ్య జరిగే పరస్పర చర్య మీద ఆధారపడి ఉంటుంది.

ఇడ్ అనేది పుట్టుకతోనే వస్తుంది. ఇది వారసత్వంగా వచ్చిన మానసిక శక్తుల, సహజాతాల రిజర్వాయరు. ఫ్రాయిడ్‌కు ఇది నిజమైన మానసిక వాస్తవికత. ఎందుకంటే అది అంతరంగ ప్రపంచాన్ని, ఆత్మగత అనుభవాన్ని ప్రతిబింబిస్తుంది. దీని మీద పరిసరం ప్రభావం ఏమీ ఉండదు. ఇది సుఖ సూత్రాన్ని పాటిస్తుంది. అంటే దానికి ఏది సుఖంగా ఉంటే, దానిని అది మంచి అయినా చెడు అయినా, కావాలంటుంది. ఇందులో రెండు రకాల ప్రాథమిక సహజాతాలుంటాయి. ఒకటి జీవ సహజాతాలు లేదా లైంగిక సహజాతాలు. రెండు మరణ లేదా దౌర్జన్య సహజాతాలు. వీటికి లభించే శక్తిని లెబిడో అంటారు.

రెండో వ్యవస్థ ఈగో. ఒక ప్రక్క సమాజం విధించే నియమాలకు ఇడ్ తృప్తి చెందించుకోవాలనే వాంఛలకు మధ్య న్యాయ నిర్ణేతగా ఇది పని చేస్తుంది. ఇది వాస్తవికతా సూత్రాన్ని అనుసరిస్తుంది. మనకు అన్ని కోర్కెలు ఎక్కడ పడితే అక్కడ ఎప్పుడు పడితే అప్పుడు తీర్చుకోవడానికి వీలుకాదు. మూత్ర విసర్జన, లైంగిక కార్యం ఎప్పుడు పడితే అప్పుడు ఎక్కడ పడితే అక్కడ తీర్చుకోవడం సాధ్యం కాదు. సమాజనియమాలు అంగీకరించవు. సరైన సమయం, స్థలం, వ్యక్తి సమాజం, ఇవి సమకూరే దాక కోర్కెను, వాయిదా వేసుకోమంటుంది. వాస్తవికతా సూత్రాన్ని అనుసరించే ఈగో. అంటే ఈగో ఇడ్ వాంఛలకు కళ్ళెం వేస్తుంది. ఈగో విచక్షణా జ్ఞాని, ఉచితానుచితాలు తెలిసింది. ఇది రీజన్-హేతువు-కు సమానం. ఇది ఇడ్ గుర్రం మీద స్వారి చేసే రౌతు. రౌతు మెత్తనైతే గుర్రం టలాయిస్తుంది. ఇక్కడ వ్యక్తిలో గనుక బాగా రీజన్ అభివృద్ధి చెందకపోతే, ఇడ్ టలాయించి తన కోర్కెలు తీర్చుకొంటుంది. అప్పుడప్పుడు జరిగే మానభంగాలను, దుర్మార్గాలను మనం ఈవిధంగానే వివరించాల్సి ఉంటుంది.

ఇడ్ కోర్కెలు సామాజిక వాస్తవికతతో విరోధించినప్పుడు వ్యక్తి వ్యాకుల చిత్తుడవుతాడు, భయకంపితుడవుతాడు. అప్పుడు ఈగో తనకున్న ఆయుధ సంపత్తితో వ్యక్తిని వ్యాకులత నుంచి కాపాడుతుంది. ఈగో చేతిలో ఉన్న ఈ ఆయుధాలను రక్షక యంత్రాంగాలు (defense machanisms) అంటారు. ఈ రక్షక యంత్రాంగం వాస్తవికతను కాదని, లేదా వ్యక్తీకరించి చూపడం ద్వారా వ్యక్తిని వ్యాకులత నుంచి రక్షిస్తుంది. ఈ యంత్రాంగం ఎప్పుడూ అచేతనంగా, అంటే వ్యక్తికి తెలియకుండా, పని చేస్తుంది. తరచు ఇది వ్యక్తికి అనారోగ్యాన్ని కలిగిస్తుంది. తనను తాను ఓడించుకొనే వానిగా వ్యక్తిని తయారు చేస్తుంది. ఈ యంత్రాంగంలో నేను ముఖ్యమైన వాటినే చెబుతాను.

ఒకటి దమనం (రిప్రెషన్). భయ పెట్టే ఒక భావాన్నో, జ్ఞాపకాన్నో, ఉద్వేగాన్నో చేతనం కానీయకుండ ఇది ఇడ్ లోకి నెట్టి వేస్తుంది. బాల్యంలో భయంకరానుభవం పొందిన ఒక స్త్రీ ఆ స్మృతిని అణచి పెట్టవచ్చు. అంటే మనస్సు అటువంటి అనుభవాన్ని అచేతనంలో పెట్టి మూత వేస్తుంది. ఆ అనుభవం అచేతనంలో ఉంటుంది గనుక, అది అక్కడ వున్నట్లు తెలియదు గనుక, ఆమె మామూలుగా వ్యాకులత లేకుండా ఉండగలుగుతుంది. రెండో యంత్రాంగం ప్రక్షేపణం అంటే ప్రొజెక్షన్. అంటే మనం అంగీకరించని భావాలను ఎదుటి వారికి అంటగడతాం. ఉదాహరణకు తన తండ్రిని ద్వేషించే పిల్లవాడు 'మా నాన్న నన్ను ద్వేషిస్తున్నాడు,' అనే నిర్ణయానికి వస్తాడు.

మూడోది ప్రతి చర్య నిర్మితి ( రియాక్షన్ ఫార్మేషన్) . అచేతనంలో ఉండి వ్యాకులత కలిగించే ఒక సంవేదన, చేతనంలో తద్వ్యతిరేక సంవేదనగా రూపం మార్చుకొంటుంది. తన భర్తను తాను ప్రేమించడం లేదనే సత్యాన్ని ఒప్పు కోవడానికి భయపడే ఒక స్త్రీ, చేతనంలో తాను తన భర్తను ప్రేమిస్తున్నానని నమ్ముతుంది. మరి అసలు ప్రేమకు ఈ ప్రేమకు తేడా కనుక్కోవడం ఎలా? చెల్లని రూపాయికి గీతలు ఎక్కువ. అలాగే ఈ ప్రేమలో 'అతి', 'తెచ్చిపెట్టుకొన్నతనం' ఉంటాయి. అతనిని నేను ఎంతగానో ప్రేమిస్తున్నాను. అతడు నా ఆదర్శ ప్రేమికుడు అంటుంది. అయితే ఇలా తెచ్చి పెట్టుకొన్న ప్రేమ ఆమెలో ఉందని ఆమెకే తెలియదు.

నాలుగోది ప్రతీప గమనం - వెనక్కు పోవడం ( రిగ్రెషన్). పుట్టిన దగ్గర నుంచి పెరిగి పెద్దవాడయ్యే లోపల వ్యక్తి అనేక దశల గుండ పయనిస్తాడని ఫ్రాయిడ్ సిద్ధాంతీకరించాడు. ఒక దశ నుంచి వ్యక్తి తరువాతి నూతన దశకు చేరినప్పుడు, అక్కడ అతనికి వ్యాకులత, కుంఠనాలు ఆటంకాలు ఎదురైతే, వాటిని అతడు పరిష్కరించ లేకపోతే, అప్పుడతడు వెనుకటి దశకు మరలి దానినే అంటిపెట్టుకొని ఉండిపోతాడు. దీనినే 'స్థిరీభవనం' అంటారు. విడాకులు తీసుకొన్న తలిదండ్రులున్న ఒక అమ్మాయి వ్రేలు చీకే చిన్ననాటి అలవాటుకు మరలుతుంది.

ఐదోది నిరాకరణం. 'మాకు పలాన విషయం అసంతోష కరంగా ఉంది' అని అసలు ఒప్పుకోకుండ, అసలలాంటిది లేదనడం, ప్రియునిపై కోపించిన యువతి అసలు అలాంటిదేమీ లేదంటుంది.

ఫ్రాయిడ్ ప్రకారం ఈ రక్షక యంత్రాంగం ఈగోని రక్షించి, వ్యక్తిని వాస్తవికతతో సవ్యంగా నెగ్గుకు రావడానికి తోడ్పడుతుంది. ఈ రక్షక యంత్రాంగాలు వివిధ వ్యక్తులకు వివిధంగా ఉంటాయి కనుక వారి మూర్తి మత్వాలు వివిధంగా ఉంటాయి. అందుకే ఒకే సమస్యకు, ఒకే పరిష్కారం ఉన్నప్పటికి, వివిధ వ్యక్తులు వివిధంగా పరిష్కరిస్తారని ఇంతకు ముందే చెప్పుకొన్నాం.

ఇహ మూర్తిమత్వంలోని మూడో వ్యవస్థ సూపర్ ఈగో. ఇది దాదాపు మనం అంతరాత్మ అని చెప్పుకొనేదానికి సమానం. ఇది నైతిక వాణిని, తలిదండ్రులు విధి ంచే విధి నిషేధాలను, సమాజ నియమాలను ప్రతిబింబిస్తుంది. ప్రతి వ్యక్తికి 'అహం ఆదర్శం' ఈగో ఐడియల్ ఉంటుంది. దాని ప్రకారమే అతడు నడుచుకొంటాడు. 'నీవెందుకు ఇలా ప్రవర్తించావని, ఒకనిని అడిగితే, నా అంతరాత్మ అలాపలికింది, నేను అందుకని అలా ప్రవర్తించానని జవాబు చెబుతాడు.

ఈ మూడు వ్యవస్థల మధ్య సమన్వయం సరిగా ఉంటే, వ్యక్తి ఆరోగ్యకరంగా ఉంటాడు. సమన్వయం లోపిస్తే మానసిక వ్యాకులతలకు, చిత్త భ్రమలకు, గాడి తప్పిన ప్రవర్తనకు గురవుతాడు.

మూడు వ్యవస్థలున్న ఈ మూర్తిమత్వం ఐదు దశలగుండా వికసిస్తుందన్నాడు ఫ్రాయిడ్. అవి మౌఖిక దశ, పాయు దశ, ఇడిపల్ లేదా శిశ్న దశ, గుప్త దశ, జననాంగ దశలు.

ఒకటోది మౌఖిక దశ అంటే ఓరల్ స్టేజ్. పసి పిల్లలు ప్రపంచాన్ని, ఆహారాన్ని రెండింటిని గూడ నోటి ద్వారానే గ్రహిస్తారు. అందుకని నోరు సంవేదనకు, ఉద్దీపనకు కేంద్రమవుతుంది. ఈ దశలో

స్థిరీభవనం చెందినవారు, పెద్దవారైగూడ, మౌఖికసంతృప్తికి వెంపర్లాడతారు. ఈ కుతిని వారు త్రాగుడు, పొగత్రాగడం, అతి భోజనం ద్వారా తీర్చుకొంటారు.

రెండోది పాయు దశ (అనల్ స్టేజి). ఇది శిశువు రెండు మూడు సంవత్సరాలు ఆక్రమిస్తుంది. ఇక్కడ నుంచే ఈగో ఏర్పడడం ప్రారంభమవుతుంది. ఎందుకంటె బిడ్డ తన ఆత్మను అంటే selfను, వాస్తవికతను ఇక్కడే గుర్తించడం మొదలు పెడతాడు. మల మూత్ర విసర్జనాదుల మీద అదుపుకు ఈ కాలంలోనే తల్లులు శిక్షణ నిస్తారు. మలాన్ని విలువైన దానిగా భావించిన పిల్లలు దానిని త్వరగా విసర్జించరు. ఈ స్థితిలో స్థిరీభవనం చెందినవారు పెద్దవారైన తరవాత దేనినీ వదులుకోవడానికి ఇష్టపడరు. అతి పరిశుభ్రతను పాటిస్తారు. లేదా దీనికి వ్యతిరేకంగా దుబారులు, అవ్యవస్థీకృతులు కావచ్చు. మూడోది శిశ్నలేదా ఇడిపల్‌దశ. ఇది సుమారు శిశువు మూడు నుంచి ఐదు సంవత్సరాలు వరకు వ్యాపిస్తుంది. ఈ దశలో పిల్లవాడు తల్లిని కామించి, తండ్రిని ద్వేషిస్తాడు. దీనిని ఇడిపస్ కాంప్లెక్స్ అంటారు. ఆడపిల్ల తండ్రిని కామించి తల్లిని ద్వేషిస్తుంది. దీనిని ఇలెక్ట్రా కాంప్లెక్స్ అంటారు.

ఆడపిల్లలకు తండ్రి వృషణ విచ్ఛేదం కావించాడని మగ పిల్లవాడు నమ్ముతాడు. ఆ పనే తనకు చేస్తాడేమోననే భీతితో, పిల్లవాడు తండ్రి అధికారాన్ని ఆమోదించి అతనితో తాదాత్మ్యం చెంది, అతని ప్రమాణాలనే స్వీకరించి, తండ్రిలాగ ప్రవర్తిస్తాడు. దీనిని తాదాత్మీకరణ ఐడెంటిఫికేషన్ అంటారు. ఈ తాదాత్మీకరణతోనే అంతరాత్మ రూపుదిద్దుకొంటుంది. ఆడపిల్లల విషయంలో ఏమి జరిగేది ఫ్రాయిడ్ అంత గట్టిగా చెప్ప లేనన్నాడు. ఆడపిల్లలకు శిశ్నేర్ష్య పెనిస్ ఎన్వి ఉంటుందన్నాడు. దీనిని సరిగా పరిష్కరించ లేని స్త్రీ దీనిని అధిగమించడానికి మగవారిలా ప్రవర్తిస్తుందన్నాడు. స్త్రీలలో నైతిక ప్రమాణం సరిగా ఉండదని, వారు మగవారి కంటె న్యూనులని భావిస్తారని, ఇతర స్త్రీలంటే అసూయ పడతారనీ, వారు దురదృష్టకరమైన నిష్క్రియాత్మకత, గర్వం, అసూయ, స్వపీడన కామం అంటే మాజోకిజమ్ లాంటి మూర్తిమత్వ లక్షణాలను పెంపొందించుకొంటారనీ అన్నాడు. ఏది ఏమైనా ఫ్రాయిడ్ స్త్రీల విషయంలో సరైన అవగాహన లేకుండానే వ్రాశాడు.

తరువాత నాలుగోది గుప్తదశ (లేటెన్సీ పిరియడ్). ఇది శిశ్న దశ నుంచి యౌవన దశ వరకు ఉంటుంది. ఈ దశలో ఆత్మ విశ్వాసం పెంచుకొని, సమాజ నియమాలను అలవర్చుకొంటాడు.

ఐదోది జననాంగ దశ (జనిటల్ స్టేజ్). వ్యక్తి పరిణతచెంది వయోజన లైంగికతకు చేరుకొంటాడు. లైంగిక శక్తి ఇప్పుడు జననాంగాలలో కేంద్రీకృత మవుతుంది. ఇదీ మూర్తిమత్వం వికసించే తీరు.

ఏది ఏమైనా ఫ్రాయిడ్‌ను మెచ్చుకొన్న వారూ ఉన్నారు, తెగడిన వారూ ఉన్నారు. ఫ్రాయిడ్ స్థానం చరిత్రలో న్యూటన్, డార్విన్, ఐన్‌స్టైన్ల సరసన ఉంటుంది. ఇందులో సందేహం లేదు. కొద్ది మినహాయింపులతో, అతని సిద్ధాంతం, ప్రాథమికంగా అంగీకార యోగ్యం. అది సార్వత్రికం. అతని సిద్ధాంతంలో కొన్ని అంశాలు కాలికమే అయినా, మిగతావి సార్వకాలీనాలు. ఏది ఎలాగున్నా అతడు ఇరవయ్యో శతాబ్దిని ప్రభావితం చేసిన వారిలో అగ్రగణ్యుడు. అతడు ప్రభావితం చేయని రంగం లేదు. పిల్లల పెంపకం, సాహిత్యం, వైద్యం, విద్య ఒకటేమిటి మానవ ప్రవర్తనకు చోటున్న ప్రతిరంగాన్ని ప్రభావితం చేశాడు.

# సెల్మా ఒట్టిలియానా లోవిసా లాజర్లోఫ్
## (1909వ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారగ్రహీత)
## పురస్కార ప్రదానం

మూలం - క్లేస్ అన్నెస్టెట్ అనువాదం - బి.వి.రామిరెడ్డి

ప్రెసిడెంట్ స్వీడిష్ అకాడెమి

ఒకప్పుడు స్వీడన్ సంపద, గౌరవం కోసం పోరాడినట్టు చరిత్ర చెబుతోంది. ఆయుధాలయుగం వెళ్ళిపోయింది. ప్రస్తుతం స్వీడన్ సాహిత్యంలో ప్రపంచంలోని పెద్ద దేశాలతో పోటీ పడుతోంది. ఇప్పుడు దేశాల ఔన్నత్యానికి జనాభా, బంగారం, సంపదలకు బదులుగా ఆదర్శాలు, ఆచరణలు కొలబద్దలయ్యాయి.

గెయిజర్, టెగ్నర్, రునెబెర్గ్ లాంటి గొప్ప వ్యక్తులు నోబెల్ పురస్కారానికి అర్హులౌతున్నారు. యువతరం రచయితలు మన సాహిత్యాన్నెంతో పరిపుష్టం చేశారు. అలాంటి వారిలో ధ్రువతార సెల్మా లాజెర్నాఫ్. ఆమె రచనల్లో, స్వచ్ఛమూ, ఉన్నతమూ అయిన స్వీడిష్ మాత లక్షణాలున్నట్టు మనం గ్రహిస్తాం. అయిదేళ్ళ క్రితమే స్వీడిష్ అకాడెమి రచయిత్రిగా ఆమె శక్తిని గుర్తించి బంగారు పతకాన్ని ప్రదానం చేసింది. ఆమె రచనల్లోని భావుకత, ఆదర్శవాదం, కథనం లాంటి ఉన్నత లక్షణాలు ఆమెను నోబెల్ సాహితీ పురస్కారానికి అర్హురాలిని చేశాయి. కేవలం స్వీడిష్ దేశస్తురాలవడం వల్లనే ఆమెకీ పురస్కారం లభించడం లేదు. వివిధ దేశాల సాహితీ వేత్తల అభిప్రాయం మేరకే ఆమెకీ పురస్కార ప్రదానం జరిగింది.

ఆమె మొదటి రచన ''గోస్టా బెర్లింగ్స్ సాగా'' (1891) పాఠకులకు అభిమాన పాత్రమయింది. ఈ రచనలో సహజత్వం వుంది. అందుకే అది అందరి మన్ననలు పొందింది. ఆ రచనలోని పాత్రలు, సంఘటనలు గొప్ప కళాత్మక సౌందర్యంతో స్వీడిష్ పల్లె జీవనాన్ని కళ్ళకు కడతాయి. అయితే ఈ రచనలో చిన్న చిన్న లోపాలు లేకపోలేదు. ఈ రచనలోని భావుకత ఉన్నతమైంది. ఆభావుకతలోంచి సృజింపబడిన పాత్రలు, సందర్భాలు రచయిత్రి యొక్క సృజన సౌందర్యానికి ప్రతీకలు. స్వీడిష్ పల్లె జీవనానికి సంబంధించిన దృశ్యాలు, వర్ణనలు పాఠకుల భావ ప్రపంచాన్ని కదిలించి వేస్తాయి.

తరువాత ఆమె మిస్టిక్ ప్రపంచపు ఊహాత్మక కథలు, గాథల ప్రపంచంలోకి ప్రవేశించింది. బాల్యం నించీ గాథల్ని విన్న తన భావుకతతో అదృశ్య ప్రపంచపు రహస్యాల్ని ఆవిష్కరించింది. లాజర్నాఫ్‌లోని ద్రష్టత్వం ఆమె రచనల్లోను, వర్ణనల్లోను దృశ్య మానం అయింది. ఆమె రచనలకు ఒక వాస్తవ శక్తి ఆలక్షణం వల్లనే ఏర్పడింది. ఆమె కేవలం బాహ్య విషయాలనే గాక తన ప్రేమ దృష్టితో అంతర్ అదృశ్య జీవితాన్ని, దాని నిశ్శబ్ద భాషనూ వివరించింది. అలా తన కల్పిత గాథల ద్వారా అందమైన రహస్యాల్ని, సజీవమైన జానపదగాథల్ని, ఋషుల కథల్ని, ప్రాపంచికాల వెనుక దాక్కున్న రహస్యాల్ని ఆవిష్కరించింది. అమ్మమ్మల భాషలో చెప్పాలంటే ''భగవంతుని రహస్యాలను చూడగల కళ్ళతో'' ఆవిష్కరించింది.

కర్షక జీవన చిత్రణలో ఆమె ప్రపంచంలోని ఏ గొప్ప రచయితకూ తీసిపోదు. 1908లో రచించిన

---

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థా ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

''ది గరల్ ఫ్రమ్ ది మార్ష్ క్రాఫ్ట్'' లో నిస్వార్థ ప్రేమలోని శక్తి వర్ణించబడింది. 1901-2 లో రచించిన ''ది హోలీ సిటీ'' ఈ రచయిత్రి రచనా శక్తికి పరాకాష్ఠ, అనూచానంగా వస్తున్న ఆధ్యాత్మిక ఉద్యమాల వల్ల ప్రభావితులైన మా దేశ ప్రజల జెరూసలెం యాత్ర ఇందులో వర్ణించబడింది. పాఠకుడు తనూ స్వయంగా ఆ తీర్థ యాత్ర చేస్తున్నట్టూ, జీవిత సమస్యల్ని గురించి తానే ఆలోచిస్తునట్టూ అనుభూతి చెందుతాడు. ఆ యాత్రికుల్లో మూఢనమ్మకానికీ, నమ్మకానికీ మధ్య జరిగే అంతస్సంఘర్షణ, తమ మాతృ దేశానికీ తమదైవ భావనకీ మధ్య జరిగిన అంతస్సంఘర్షణలో చివరికి మాతృ భూమిని వొదిలి పవిత్రపట్టణ ప్రయాణం వైపే ప్రయాణిస్తారు. తమని తాము మాతృ భూమికి దూరం చేసుకున్నా, తమ రక్షకుడి పాద స్పర్శతో పునీతమైన పవిత్ర స్థలాన్ని చూడగలిగామన్న సంతృప్తిని సాధిస్తారు. అడవుల, నదుల శబ్దాలు వాళ్ల చెవుల్లో ఎప్పుడూ వున్నాయి. వారి ఆత్మల్లోని రహస్య మూలాల్ని ఆమె ఎంతో ప్రేమాన్వితంగా వాస్తవీకరిస్తుంది. ఈ పుస్తకానికి వ్రాసిన ముందుమాట ''ఇంగెమార్స్ సన్స్'' లో వర్ణించబడ్డ మన తండ్రుల జీవితాలు, వారి కార్యకలాపాలు తరువాతి జీవితాల వారికి మార్గదర్శకాలౌతాయి.

సెల్మా శైలి గొప్పది. నమ్రతగల పుత్రికగా తన మాతృ భాష యొక్క పారంపర్యాన్ని ఆవిష్కరించింది. అందుకే ఆమె శైలికి అంత స్వచ్ఛత, ఆమె వ్యక్తీకరణకు అంత విపులత, శ్రావ్యత. శైలికి సంబంధించిన నిరాకారత, సౌందర్యం, భావుకత లాంటి గొప్ప లక్షణాలకు మత నమ్మకం, లాంటివి తోడై ఆమె శైలికి గొప్ప శక్తిని తెచ్చి పెట్టాయి. ''మానవ జీవితం భగవంతుడి మగ్గంలోని దారం'' అని నమ్మేవారికి అలాంటి శైలి సహజమే. స్వీడిష్ ప్రజల ఆత్మల్ని కదిలించే ఉన్నత విషయాలు ఆమె సాహిత్యంలో చోటు చేసుకున్నాయి. ఆమెలా ప్రేమతో తన ప్రజల స్వభావాన్ని అర్థం చేసుకున్నవారు అతికొద్ది మంది మాత్రమే. ఆమె రచన ''టోసెన్ ఫ్రాన్ స్టార్మర్ టార్ప్'' లోని న్యాయాధిపతి ప్రేమతో ఆత్మార్పణకు సిద్ధపడ్డ యువతిని చూశాక ''అదీ నా ప్రజల పద్ధతి. నాకు వారి మీద కోపం లేదు. దైవ భక్తి, దైవ భీతి ఆమెలో సంపూర్ణంగా ఉన్నాయి.'' అంటాడు. అలాంటి దృక్పథం కేవలం ఆత్మలో స్వీడిష్ నేలలోని చరిత్ర, పురాణం, జానపద గాథలు, ప్రకృతి ఇంకిన వారికి మాత్రమే ఉంటుంది. సెల్మా రచనల్లో నార్డిక్ ప్రకృతి సిద్ధమైన మార్మికత, గతం మీది ప్రేమ, లాంటి లక్షణాల్ని, సులభంగా అర్థం చేసుకోవొచ్చు. తన హృదయాన్ని మేధా సంపత్తితో జోడించి తన ప్రజల వ్యక్తిత్వాన్ని, పద్ధతుల్ని రూపుదిద్దడంలోనే ఆమె గొప్పదనం ఇమిడివుంది.

దైవ నిర్ణయం ప్రకారం నడుచుకునే వారికి మానవ హృదయాల ఉన్నత పార్శ్వాలను స్పృశించగలశక్తి ఉంటుంది. అలాంటి వారిని మనం గౌరవిస్తాం. అందుకే ఈ రోజు స్వీడిష్ అకాడెమి స్వీడన్ దేశపు ఉన్నత పుత్రిక అయిన సెల్మాలాజర్లోఫ్‌కు నోబెల్ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నది.

## పురస్కార స్వీకారం

కొద్దిరోజుల క్రితం నేను స్టాక్‌హోంకు ప్రయాణిస్తున్న రైల్లో కూర్చుని వున్నాను. అది ఉషోదయం. కంపార్ట్‌మెంట్‌లో కొద్దిగా వెలుతురుంది. నా సహ ప్రయాణీకులు వారి సీట్లలో జోగుతున్నారు. రైలు పట్టాల శబ్దాలు వింటూ కూర్చున్నాను.

ఇదివరలో స్టాక్‌హోంకు ప్రయాణించిన సందర్భాల్ని గురించి ఆలోచించడం ప్రారంభించాను.

ఇదివరలో పరీక్షలు వ్రాయడానికీ, నా రచనల్ని ప్రచురించే పబ్లిషర్లను కలుసుకునేందుకు వస్తూ వుండేదాన్ని. ఇప్పుడు నోబెల్ సాహితీ పురస్కారాన్నందు కోవడానికి స్టాక్‌హోం వొస్తున్నాను. ఇదీ కష్టతరమైన పనే.

శరదృతువు అంతా నేను నా వార్మ్‌లాండ్ పాత ఇంట్లో, ఏకాంతంలో నివసించాను. ఇప్పుడు ప్రజల మధ్యకు అడుగిడబోతున్నాను. జీవితపు రణగొణల గందరగోళాలకు సిగ్గుపడిపోయి ఏకాంతంలోకి వెళ్ళి పోయాను. ఇప్పుడు మళ్ళీ ఆ ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే భయంగా వుంది.

నా లోలోపల ఈ పురస్కారాన్నందు కుంటున్నందుకు ఆనందంగా వుంది. నా అదృష్టానికి ఆనందించే వారిని తలుచుకుని నాభయాన్ని మర్చిపోయేందుకు ప్రయత్నించాను. నా మిత్రులు, సోదరులు, సోదరీమణులు; మరీ ముఖ్యంగా మా అమ్మ, ఇంటి గుమ్మంలో కూచుని, ఈ రోజు నన్ను చూసేందుకు జీవించి వున్నందుకు సంతోషిస్తుంది.

తరువాత మా నాన్నగార్ని తలుచుకుని దుఃఖపడ్డాను. ఈ శుభసందర్భాన్ని వీక్షించి ఆనందించేందుకు ఆయన లేడు. ఆయన దగ్గరికి వెళ్ళి నా సాహిత్యానికి నోబెల్ బహుమతి లభించిందని ఆయనతో చెప్పుకునే అదృష్టం నాకులేదు. ఈ వార్త విని ఆయన కన్నా ఉన్నతంగా ఆనందించే వారెవ్వరూ వుండరని నాకు తెలుసు. ఆయన లాగ నన్నూ, నా అక్షరాల్నీ ప్రేమించిన వారెవ్వరూ లేరు. స్వీడిష్ అకాడెమి నాకు నోబెల్ బహుమతిని ప్రదానం చేసిందని ఆయనకు తెలిస్తే బావుణ్ణు. ఈ విషయాన్ని ఆయనకు చెప్పుకునే అవకాశమూ, అదృష్టమూ లేకపోవడం నాకు దుఃఖాన్ని కలిగిస్తోంది.

ఎవ్వరైనా చీకట్లోంచి దూసుకు పోయే రైల్లో కూచుని, రైలు శబ్దాల్ని వింటూ వాటి శ్రావ్యతలోని ప్రశాంతతనీ ఓదార్పునీ అనుభవిస్తారు. మా నాన్నగార్ని మళ్ళీ చూడాలనే నా ఆలోచనలో నేను అలానే కూచుని వున్నాను. రైలు మార్దవ శబ్దాల్లో పగటి కలల్లోకి జారిపోయాను. స్వర్గంలో వున్న మా నాన్న గార్ని కలుసుకోవడానికి వెడుతున్నాను!!! చాలామందికి ఇలాంటి అనుభూతి కలగడం గురించి విన్నాను.రైలు సుదూర తీరాలకు అలా వెడుతూనే వుంది. దానికన్నా ముందు నా ఆలోచనలు పరిగెడుతున్నాయి. నాన్న ప్రకాశవంతంగా విచ్చుకున్న పూలతోట మధ్య వరండాలో తూగు కుర్చీ మీద కూచుని ఉంటాడు. సూర్యరశ్మిలో పక్షులు కలకలారావాలు చేస్తుంటాయి. ఆయన ''ఫ్రిట్జాఫ్‌సాగా'' చదువుతుంటాడు. నన్ను చూడగానే పుస్తకం పెట్టేస్తాడు. కళ్ళజోడును పైకినెట్టుకుని, లేచి నాకు ఎదురొస్తాడు.

''నేడెంతం శుభదినం. అమ్మా, నిన్ను చూడ్డం... నాకెంతో ఆనందంగా వుంది.'' ''ఇక్కడికెందు కొచ్చావ్? ఇంతకీ ఎలా వున్నావు?'' అంటాడు నాన్న.

మళ్ళీ తూగు కుర్చీలో కూచుని తనని చూడ్డానికి నేను వొచ్చినందుకు ఆశ్చర్య పోతాడు.

''ఏమిటీ... ఏమన్నా పోగొట్టుకున్నావా?'' హఠాత్తుగా అడుగుతాడు.

''లేదు నాన్నా... అంతా సవ్యంగానే వుంది'' అంటాను. అసలు విషయాన్ని చెప్ప బోయే ముందు కాస్త ఆగి, విషయాన్ని కాస్త మార్మికంగా, కాస్త ఆలస్యంగా చెబుదామనుకుంటాను.

''నిన్నొక సలహా అడుగుదామని వొచ్చా నాన్నా... నేను చాలా అప్పుల్లో పడిపోయాను'' అంటాను.

''నా దగ్గర్నించి ఈ విషయంలో అంతగా సహాయం దొరకదను కుంటాను...'' నాన్న అంటాడు. ''మన వార్మ్‌లాండ్‌లోని పాత ఎస్టేట్లలాగ ఇక్కడా డబ్బు తప్ప అన్నీ వుంటాయని ఎవరైనా అంటారు...''

''నా అప్పులు డబ్బుకు సంబంధించినవి కావు నాన్నా... అంతకన్నా భయంకరమైనవి.''

''అయితే మొదట్నించీ చెప్పమ్మా...''

''నిన్ను మరీ ఎక్కువ సహాయం అడగనులే... మొదట్నించీ అది నీ పొరబాటే ... నీకు గుర్తుందా...? మేం చిన్న పిల్లలంగా ఉన్నప్పుడు నువ్వు పియానో మీద బెల్‌మన్ పాటల్ని వినిపించే వాడివి ... శీతాకాలంలో రెండు సార్లన్నా టెగ్నర్, రునెబెర్గ్, ఆండర్సన్‌లని చదివించేవాడివి...అప్పుడే మొదటిసారిగా నేను అప్పులో పడ్డాను. నాన్నా... కాల్పనికగాథల్ని, వీర గాథల్ని ప్రేమించమని బోధించిన వారికి, మన మాతృ భూమికి, మన జన జీవ నానికి, వాటి గొప్పదనానికి ... అన్నింటికీ... అందరికీ రుణపడిపోయాను...''

నాన్న తన తూగుకుర్చీలో నిటారుగా కుర్చుంటాడు. ఆయన కనుల్లోకి వింత వెలుగొస్తుంది .

''నిన్ను అప్పుల్లోకి నెట్టినందుకు నాకు సంతోషంగా వుంది ...'' అంటాడు.

''నువ్వన్నది నిజమే నాన్నా, ఆదొక్కటేకాదు, ఆలోచించు, నాకెంతమంది అప్పుల వాళ్ళున్నారో. నీ యౌవనంలో, నిరుపేదవాళ్ళు, నీడా గూడూ లేనివాళ్ళు, తిరుగుబోతులు, మన వార్మ్‌లాండ్‌లో వస్తూపోతూ ఆ పాటలన్నీ పాడడం, హాస్య పాత్రల్ని నటించడం - గుర్తుందా? వాళ్ళకి నేను రుణపడిలేనంటావా? అడవిలోంచి వొచ్చాక వృద్ధులు వాళ్ళ గుడిసెల ముందు కూచుని జలకన్యల్ని గురించీ, మంత్రముగ్ధుల్ని చేసి పర్వతాల్లోకి తీసుకు వొచ్చిన కన్యల్ని గురించి కథలు చెప్పి, రాళ్ళల్లో, చీకటి అడవుల్లో కవిత్వం వుందని బోధించారు. నాన్నా ... ఆలోచించు, ఆ సాధువులు, సన్యాసులు, సన్యాసినులు తమ దివ్య దృష్టితో చూసిన, దివ్య చక్షువులతో విన్న విషయాల నుండి నేను ఎన్నో పురాణ గాథల్ని అరువు తెచ్చుకున్నాను. జెరూసలెం వెళ్ళిన మనకర్షకులు ... ? వీళ్ళందరి దగ్గర్నించీ నేను ఎంతో తెచ్చుకున్నాను గదా... మరి వారి బాకీ మాటేమిటి? నేను మన జనానికే కాదు. మన ప్రకృతికీ ఎంతో రుణపడి వున్నాను. నేల మీద నడిచే జంతువులు, ఆకాశంలో ఎగిరే పక్షులు, చెట్లు, పువ్వులు. అన్నీ తమ రహస్యాల్లో కొన్నింటిని నాకు చెప్పాయి...''

నాన్న ఓ చిరు నవ్వు చిందిస్తాడు ...

''నేను ఎంతో అరువు బరువును మోస్తున్నానని నీకు తెలుసుగా నాన్నా...'' అని సీరియస్‌గా మొహం పెడతాను.

''నేను ఈ రుణాలన్నీ ఎలా తీర్చుకోగలనో స్వర్గంలో వున్న నీవు తప్ప, భూమ్మీద వున్న వాళ్ళెవరికీ తెలీదు.''

''మనకి తెలుసు భయపడకమ్మా... నీ కష్టాలకొక పరిష్కారం వుంది.'' అంటాడు నాన్న.

''అంతేకాదు నాన్నా ... మన భాషని ఎలా ఉపయోగించాలో నేర్పిన వారందరికీ, నాకన్నా ముందు వచన, కవితా రచనల్ని చేసి వాటిని కళాత్మకంగా మలిచిన మార్గదర్శులకీ నేను రుణపడే వున్నాను

కదా? నా బాల్యంలో గొప్ప రచయితలైన నార్వీజియన్లకీ, రష్యన్లకీ ఎన్ని వేల అప్పు పడ్డానూ? నా సమకాలీన సాహిత్యం ఉన్నత శిఖరాలనందుకుంది. అందుకు కారకులైన రిడ్‌బెర్గ్, స్నోయిస్కీల కవిత్వం; స్ట్రిండ్‌బెర్గ్ శిఖరాలు, గీజెర్‌స్ట్రాం పల్లె జనం, ఆనీ ఛార్లెట్ ఎడ్గ్రెన్ల ఆధునికులు; ఎర్నెస్ట్ ఆర్లైన్, హీడెన్ స్ట్రాంల ప్రాచ్యత - లాంటి వారిని చూసే అదృష్టం కలిగింది కదా? చరిత్రని సజీవంగా వించిన సోఫీ ఎల్కాన్, వార్మ్‌లాండ్ మైదానాల కథలు వ్రాసిన ఫ్రోడింగ్, పురాణగాథలు వ్రాసిన లెవెర్టిన్, హాల్‌స్ట్రాం తనాటోలు, కార్ల్ ఫెల్డ్జ్ డలెకార్లియన్ వ్రాసిన స్కెచ్‌లు - అన్నీ నా భావ ప్రపంచాన్ని ప్రభావితం చేసి, పోటీగా నా కలల పంటల్ని పండించాయి గదా? వారందరికీ నేను రుణపడి లేనంటారా...?''

''అవునవును ... నువ్వు చెప్పింది నిజమే. నీది చాలా పెద్ద రుణ భారం. కాని భయపడకు. అందుకే దైనా మార్గాన్ని వెదుకుదాం ...'' అంటాడు నాన్న.

ఈ రుణ భార విముక్తి ఎంత కష్టతరమైందో నీవు అర్థం చేసుకో లేవనుకుంటా ... నా పాఠకుల క్కూడా నేను రుణపడి వున్నాను. నా ముసలిరాజు, అతని చిన్న కొడుకు నన్ను దక్షిణాది పర్యటనలకు పంపినపుడు స్కూలు పిల్లలు నాకు నిల్స్ హోల్గెర్సన్‌ని గురించి కృతజ్ఞతలతో ఉత్తరం వ్రాశారు. ఎవరూ నా పుస్తకాల్ని చదవకనే పోతే నా పరిస్థితి ఏమిటి? నన్ను గురించి వ్రాసిన వాళ్ళను మర్చిపోకు... గుర్తుందా? ప్రసిద్ధుడైన ఆడెనిష్ విమర్శకుడు నన్ను డెన్మార్కు దేశమంతటికీ పరిచయం చేశాడు కదా? అతనిపుడు లేడు. నాకోసం శ్రమించిన ఆ విదేశాలనుగురించి యోచించు... నాన్నా ... వాళ్ళకి నేను కృతజ్ఞతా పరంగా రుణపడి వున్నాను కదా ... ?''

''అవునవును ... ''నాకు సహాయ పడడం అంత సామాన్యమైన వ్యవహారం కాదని నాన్న గ్రహిస్తున్నాడు. అందుకే నాన్నలో కొద్దిగా అశాంతి ...

''నాకు సహాయపడ్డ వాళ్ళందర్నీ గుర్తు చేసుకో నాన్నా ... నా విశ్వాస పాత్రుడైన మిత్రుడు ఎస్సెల్డెని గుర్తుచేసుకో... నన్నెవ్వరూ నమ్మని పరిస్థితిలో అతను నా కోసం కవాటాలు తెరిచేందుకు ప్రయత్నించాడు. నన్నూ, నా శ్రమనీ కాపాడ్డం కోసం ప్రయత్నించిన వాళ్ళని గుర్తు చేసుకో. నా దక్షిణాది ప్రయాణ సహపథికుడు, నాకు కళా ఔన్నత్యాల్ని చూపిన వాడు. నా జీవితాన్ని సంతోషభరితం చేసినవాడు - నా మిత్రుణ్ణి తలుచుకో ... నాకు లభించిన ప్రేమ, గౌరవం, పురస్కారాలు - వీటి మాటేమిటి? ఇప్పుడర్థమైందా నీకు ... ఎన్ని అప్పుల ఊబిలో కూరుకుని నిన్ను సహాయం అడగడానికొచ్చానో ... ?''

నాన్న తలవొంచుకు కూచున్నాడు. బహుశా ఆశవొదులుకుని వుంటాడు...

''నేనొప్పుకుంటున్నానమ్మా... నీకు సహాయపడడం అంత సామాన్యమైన పనేమీ కాదు. కాని, నువ్వింకెవ్వరికీ రుణపడలేదంటావా...?''

''అవున్నాన్నా ... ఇంతవరకూ వున్న అప్పుల్ని భరించటమే కష్టంగా వుంది. కాని, నా అతి పెద్ద అప్పు లెక్క ఇంకా రావలసే వుంది. అందుకోసమే నీ సలహా కోసం వొచ్చాను...''

''ఇంకా నీకు మిగిలివున్న అప్పులేమిటో నేను అర్థం చేసుకోలేక పోతున్నాను...''

''అవును ...''

అప్పుడు చెబుతాను నాన్నకి, ఈ పురస్కారాన్ని గురించి -

''నాకు నమ్మకం కలగడం లేదు .. స్వీడిష్ అకాడెమీ ...''

నాన్న నామోహంలోకి చూసి అదంతా నిజమేనని గ్రహిస్తాడు. ఆయన ముఖంలోని ముడతలన్నీ వొణుకుతాయి... ఆయన కళ్ళునిండా బాష్పాలు ...

''నా పేరును ఈ పురస్కారానికి ప్రతిపాదించిన వారికీ, నిర్ణేతలకీ... ఏం చెప్పను నాన్నా ... ? నాన్నా ... ఆలోచించు ... పురస్కార గౌరవమూ, డబ్బేకాదు వారు నామీద వుంచింది - నా మీద నమ్మకాన్నుంచారు. అందుకే నన్ను ప్రపంచమంతటినించీ వేరు చేసి చూపించి ప్రపంచం ముందు నించో పెట్టారు. ఈ రుణాన్ని ఎలా తీర్చుకోగలను నాన్నా?''

నాన్న ఆలోచిస్తుంటాడు మౌనంగా కూచుని ... ఆనంద భాష్పాల్నితుడుచుకుని కుర్చీచేతిమీద పిడికిలితో గుద్ది అంటాడు:

''స్వర్గంలోనూ, భూమ్మీదా ఎవ్వరూ తీర్చలేని సమస్యల్ని గురించి నా బుర్ర బద్దలుకొట్టుకోను. నాకు మహదానందంగా వుంది, నీకు నోబెల్ బహుమతి వొచ్చినందుకు... నేనింక వేటిని గురించీ బాధ పడను...''

అవును... ఉన్నతులారా ... మహాప్రభూ ... సంస్కారులారా ... నా ప్రశ్నలన్నింటికీ ఇంతకన్నా గొప్ప సమాధానం లేనందువల్ల మిమ్మల్ని నేను స్వీడిష్ అకాడెమీకి అర్పిస్తున్న ఆనంద పూరితమైన కృతజ్ఞతలలో పాలు పంచుకోమని అభ్యర్థిస్తున్నాను.

## జీవిత చరిత్ర

సెల్మా లాజర్లోఫ్ (1858-1940) ఓస్ట్రా ఎమ్టెర్లిక్ వార్మ్‌లాండ్‌లో జన్మించింది. ఆమె తన కుటుంబానికి చెందిన ఎస్టేట్ మార్బెక్కాలో పెరిగింది. 1881లో స్టాక్‌హోంలోని టీచర్స్ కాలేజీలో చేరింది. 1885లో లాండ్స్‌క్రోనాలోని బాలికల సెకండరీ పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేరింది. బాల్యంనించీ కవిత్వం వ్రాస్తుండేది. 1891లో ఒక స్వీడిష్ వారపత్రికలో ప్రచురింపబడ్డ ఆమె రచనకు మొదటి బహుమతి లభించింది. 1891లో ''గోస్టా బెర్లింగ్స్ సాగా'' ప్రచురింపబడింది. దీనికి డేనిష్ అనువాదం ఆమెకు కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టింది. 1895లో రాజకుటుంబం నుండి ఆమెకు ఆర్థిక సహాయం లభించింది. స్వీడిష్ అకాడెమి అందించిన సహకారంతో ఉపాధ్యాయ వృత్తిని వొదిలేసింది. ఇటలీలో పర్యటించి 1897లో ''ది మిరకిల్స్ ఆఫ్ యాంటీ క్రైస్ట్'' నవలను రచించింది. 1901 -2 సంవత్సరాల మధ్య ''ది హోలీసిటీ'' నవలరచించింది. ఇందులో స్వీడిష్ కర్షకులు జెరూసలెంకు వలసపోయి స్థిరపడడం ప్రధాన విషయం. 1900లో ఆమె జెరూసలెంలో వారిని సందర్శించింది. 1906లో ఆమెరచించిన ''ది వండర్‌ఫుల్ అడ్వెంచర్స్ ఆఫ్ నిల్స్'' అనే రచను స్కూలు పిల్లలకోసం చేసింది. ఇది ప్రపంచ బాల సాహిత్యంలో ఎన్న దగిన ఉత్తమ రచన.

ఆమె తరువాతి రచన లేవీ ''గోస్టా బెర్లింగ్స్ సాగా'' లాగ ప్రసిద్ధంకాలేక పోయాయి. 1925లో రచించిన ''రింగెన్'', 1927లో రచించిన ''చార్లెట్ లోవెన్స్ స్కోల్డ్'', 1928లో రచించిన ''అన్నా స్వార్డ్'' అనే చారిత్రక త్రికం ఎన్నదగింది. ''మార్బెక్కా'' పేరుతో 1922-32ల మధ్య తన స్మృతుల్ని గ్రంథస్థం చేసింది.

# స్నేహ సారము

- డా॥ యు. ఏ. నరసింహమూర్తి

భవభూతి ఉద్ధతకవి. అయినా స్నేహ శబరిత మయిన ఉదాత్త దృశ్య కావ్యాన్ని రాసి ''ఉత్తరే రామ చరితే భవభూతి ర్విశిష్యతే'' అనే ప్రఖ్యాతిని పొందాడు. స్నేహము-వైరము పరస్పర విరుద్ధములైన సహజాతాలు. ప్రాణికోటి అంతటా ఇవి అంతర్నిహితంగా ఉంటాయి. స్నేహాన్ని పెంచుకోవడం, వైరాన్ని త్రుంచుకోవడం ఉన్నత సంస్కార లక్షణం. ఉదాత్త పాండిత్యం ఈ సంస్కారాన్ని పెంచిపోషించడమే కాక నిరంతరాయంగా కొనసాగేలా కాపాడుతుంది. నిరవధిక్మైన కాలంలో, విపులమైన పృథ్విలో ఉన్నత సంస్కార సమాన ధర్మం నిరంతరంగా ఉత్పత్స్యమానమయ్యేలా అమృత మయమైన వాణిని అందించగల వశ్యవాక్కులను, పరిణతప్రజ్ఞులను మహాకవులని అంటాము. భవ భూతి మహాకవి.

స్నేహం శాంతినిస్తుంది. వైరం భీభత్సాన్ని సృష్టిస్తుంది. వైర భావం నిప్పురవ్వలాంటిది. అది శాంతి వనాన్ని దహిస్తుంది. ఆ దహనం లోంచి కరుణ కదలివస్తుంది. దహనకాండ ఎంత భీభత్సకరంగా ఉంటే కారుణ్యం అంత ప్రగాఢంగా ఉంటుంది. వైరానికి ప్రతిఘటన లేనపుడే కరుణ వెల్లివిరుస్తుంది. ఆ వెల్లువలో వైరంకూడా స్నేహంగా మారుతుంది. ప్రవక్తలు ఆచరణ పూర్వకంగా నిరూపించిన సత్యమిది. ఉత్తర రామ చరిత్రలోని పాత్రలన్నీ ఈ ప్రవక్తృ శీలాన్ని కలిగి వున్నాయి. వైర భావంతో కూడిన పాత్రగాని, సన్నివేశంగాని, సంభాషణగాని, వర్ణనగాని, అభివ్యక్తిగాని ఎక్కడా కనబడదు, వినబడదు. అయినా నాటక మాద్యంతము ఉద్దామమైన అంతర్లీన దుఃఖాన్ని జ్వలిస్తూ ఉంటుంది. దీని కంతటికీ దుర్ముఖుడు ఎవరికీ వినపడకుండా రాముని చెవిలో చెప్పిన జనాపవాద వాగ్వజ్రము మూలము. లోకోత్తరుడైన శ్రీరాముని చేతము వజ్రంకంటె కఠోర్మైనది. కుసుమం కంటె మృదువైనది. ఈ వైరుధ్యమే బలీయమైన సంఘర్షణకు మూలం, నాటకీయతకు నెలవు. శ్రీ కంఠ పదలాంఛనుడైన భవభూతి- వాల్మీకి కాళిదాసుల కంటె భిన్నమైన మార్గంలో కరుణ రస నిర్భరంగా ఉత్తర రామ చరితను తీర్చిదిద్దడానికి, పుటపాక ప్రతీకాశమైన కరుణ రసాన్ని పోషించడానికి బలిష్ఠమైన ఈ సంఘర్షణ మూలమయింది. కరుణము అంగిరసం కావడానికి స్నేహభావము అనుపదము అనుప్రాణితమయింది. పాత్రలన్నీ స్నేహ భావంతో పరిఢవిల్లాయి. నాటకమంతా స్నేహపిచ్ఛిల మయింది. మానవ పాత్రలే కాదు అతి మానుష పాత్రలు, ఇతర ప్రాణులు, స్థావర జంగమ ప్రకృతి - అంతా స్నేహబంధ సంవలిత మయింది. కాళిదాసు చెప్పిన స్నిగ్ధ జన సంవిభక్తమైన దుఃఖం ఈ నాటకంలో రాజ్యమేలింది.

ఏ కోరసః కరుణ పద నిమిత్త భేదాత్ భిన్నః పృథక్ పృథగి వాశ్రయత్స్ వివర్తాన్

ఆవర్త బుద్బుద తరంగమయాన్ వికారాన్- అంభో యథా సలమేవహి తత్సమస్తమ్.

నాయికా నాయకులలోనే ఈ రసం నిమిత్త భేదాన్ని బట్టి ఆవర్త బుద్బుద తరంగ భేదాలను పొందినట్లు వ్యాఖ్యాతలు చెప్తున్నారు. కరుణ రస పూరంలో మిగిలిన పాత్రలన్నీ కూడా ఆవర్త బుద్బుద తరంగ భేదాలతో దర్శనమిస్తున్నట్లు కూడా కనిపిస్తుంది. కరుణ మా కరుణ విప్రలంభమా అన్న వివాదాన్ని ప్రస్తుతాంశంగా పరిగణించక పక్కన పెడితే స్నేహభావ బంధురమైన నాటకీయ వాతావరణమంతా ఈ దృశ్య కావ్యాన్ని ఆద్యంతము కారుణ్యకోశంగా తీర్చి దిద్దింది. శుద్రటుడు

---

డా॥ యు. ఏ. నరసింహమూర్తి, విజయనగరం, మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షునిగా పదవీ విరమణ చేసి, అక్కడే యు. జి. సి. ఎమిరిటస్ రీసెర్చి ఫెలోగా ఉంటున్నారు.

''దశమోరసః ప్రేయాన్'' అని స్నేహాన్ని పదవ రసంగా ప్రతిపాదిస్తే అభినవ గుప్తుడీ వాదాన్ని అంగీకరించ లేదు. ''స్నేహ ప్రకృతిః ప్రేయాన్'' అంటూ ప్రేయో రసానికి స్నేహం స్థాయీ భావంగా చెప్పబడింది. ''అన్యోన్యం ప్రతి సుహృదోర్వ్యవహారో ఽయం మతస్తత్ర'' అనే వివరణ స్నేహితుల పరస్పర వ్యవహారమే ప్రేయోరసము అని చెప్తుంది. ఇక్కడ కూడా ఆలంకారిక మత భేదాల నటుంచితే ప్రేయస్సు వైరం తత్వ ప్రకృతిగా నిలిచి కరుణానికి అంగరసంగా పోషితమైనట్లు భావించగల అవకాశం ఉంది. ఈ కావ్య ప్రయోజనం స్నేహఫలంగా అనుభవాని కొస్తుంది.

ఉత్తర రామ చరిత్రలో స్నేహం - దాంపత్య స్నేహం - అపత్యస్నేహం - బంధు స్నేహం - భుస్నేహం - దివ్యస్నేహం- ప్రాణి స్నేహం - ప్రకృతి స్నేహం ఇలా బహుముఖాలుగా విస్తరించింది. అన్నింటికీ భూమిక ఒకటే. సన్నివేశ ప్రాబల్యాన్ని బట్టి కొన్ని పాత్రలలో ఇది అతి వేలంగా కనిపిస్తుంది; కొన్ని పాత్రలలో అది గూఢంగా నిలుస్తుంది. స్నేహమంటే ఏమిటో మహా వీర చరితలో సుగ్రీవుడిలా చెప్తాడు.

ప్రాణై రపి హితా వృత్తి రద్రోహో వ్యాజవర్జనమ్
ఆత్మనీవ ప్రియాధాన మేత న్మైత్రీ మహావ్రతమ్. 5.59.

ప్రాణాలిచ్చైనా మేలు చేయడం, ద్రోహం చేయకుండా ఉండడం, కుంటి సాకు లడ్డుపెట్టకుండా ఉండడం, తనుగా భావించుకుని ప్రీతిని కలిగించడం - అనేవి మైత్రీ మహావ్రత లక్షణాలు. స్నేహమంటే ఏమిటో ఉత్తర రామ చరితలో చంద్రకేతుడు ఇంకా సూక్ష్మంగా చెప్పేడు. అతడు లవుడితో ఇలాగంటాడు.

'అత్యద్భుతా దసి గుణాతి శయాత్ప్రియోమే
తస్మాత్సఖాత్వమసి, యన్మమ తత్తవైవ' 5 - 10

అత్యద్భుతమైన గుణాతిశయంతో నాకు ప్రియుడ వయ్యావు. అందుచేత సఖుడవయ్యావు. నాదంటూ ఏది ఉందో అదంతా నీదే అంటాడు. ఇది మైత్రీ మర్యాద. స్నేహమంటే త్యాగం. కథానాయకుడైన శ్రీరాముడు ధార్మిక స్నేహం కలవాడు. ఆయన స్నేహానికి పరాకాష్ఠ. ప్రజారాధన ఆ స్నేహం కోసం ఆయన

'స్నేహం దయాం తథా సౌఖ్యం యదివా జానకీ మపి
ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తి మే వ్యథా ॥ 1-5

అంటూ ఇతర విషయాల పట్ల స్నేహాన్ని, దయను, సౌఖ్యాన్ని చివరకు సీతను కూడా త్యాగం చేస్తానన్నాడు. ఇక్కడ రాముని నోటివెంట వచ్చిన మొదటి మాట స్నేహం.

స్నేహం సహజాతమని సుమంత్రుడు చెప్పాడు. ''భూయసా జీవి ధర్మ ఏషః. యత్ర రసమయీ కస్యచి త్క్వచిత్ప్రీతిః యత్ర లౌకికానాం వ్యవహార స్తారామైత్రం, చక్షూరాగ ఇతి, తనుప్రతి సంఖ్యేయా ప్రమాణ మామనన్తి''. స్నేహ పూర్ణమయిన ప్రీతి ప్రాయికంగా ప్రాణుల స్వభావము ఒకానొకనికి ఒకప్పుడు కలిగే ఈ ప్రీతిని లోకంలో తారామైత్రమని చక్షూరాగమని అంటారు అని సుమంత్రుని మాటల కర్థం. తారా మైత్రమంటే కంటిపాపల కలయిక అని పరస్పర గ్రహమైత్రి అని కూడా చెప్తారు.

కన్నులతో పెంపొందే అనురాగాన్ని చక్షూరాగమని అంటారు. లవుని అత్యద్భుత గుణాతిశయం తన స్నేహానికి ప్రేరణ అయిందని చంద్రకేతుడు అన్నాడు. కాని నిజానికి స్నేహానికి హేతువంటూ ఒకటి ఉండనవసరం లేదు, అది నిర్హేతుక జాయ మానము. చంద్రకేతుని కన్న అనుభవజ్ఞుడైన సుమంత్రుడీ విషయాన్ని వెంటనే వివరిస్తాడు. హేతు బద్ధమైన స్నేహంకంటె నిర్హేతుకమైన స్నేహం గొప్పది.

అహేతుః పక్షపాతో యస్తస్య నాస్తి ప్రతిక్రియా
సహిస్నేహాత్మక స్తన్తు రన్త ర్మర్మాణి సేవ్యతి. 5.12

నిర్హేతుకమైన స్నేహానికి నాశనం లేదు. స్నేహము ఒక దారము. అది కనిపించని ఆయువుపట్లను కుట్టేస్తుంది. అందుకే స్నేహ ప్రాబల్యానికి పరవశించి పోయిన లవ చంద్రకేతు లిద్దరూ ఒక్కసారిగా ఇలా అనుకుంటారు.

యదృచ్ఛా సంవాదః కిము కిముగుణానా మతిశయః
పురాణోవా జన్మాన్తర నిబిడ బద్ధః పరిచయః
నిజోవా సంబంధః కిము విధివశాత్కోఽప్యవిదితో
మమైతస్మిన్ దృష్టే హృదయ మవధానం రచయతి. 5.16

మా మధ్య నడచిన మాటలా? ఇతనిలోని గొప్ప గుణాలా? అనేకానేక జన్మల నుండి వెంటాడే దృఢ బంధమా? నా హృదయం ఇతని పట్ల తదేక ధ్యానంతో నిలిచి పోవడానికి హేతువేమిటి? అంటూ ఇద్దరూ భావోద్వేగానికి లోనౌతారు. వాళ్లిద్దరూ బాలురు కాబట్టి వారి అనుభవానికి మూలాన్ని కనిపెట్టలేకపోయారు. శ్రీరాముడు అనుభవశాలి. ఆయన ఈ గ్రంథిని విప్పేడు.

వ్యతిషజతి పదార్థా నాంతరః కోఽపిహేతు
ర్నఖలు బహిరు పాధీన్ ప్రీతయ స్సంశ్రయన్తే
వికసతి హి పతంగ స్యోదయే పుండరీకమ్
ద్రవతిచ హిమరశ్మా వుద్గతే చంద్రకాంతః 6-5

సూర్యోదయం కాగానే పద్మాలు వికసిస్తాయి. చంద్రోదయం కాగానే చంద్రకాంత శిలలు ద్రవిస్తాయి. ఏదో ఒక గూఢమైన హేతువు ఈ సంబంధాన్ని కల్పిస్తుంది. స్నేహం బయటి కారణాలను బట్టి ఏర్పడదు అని విడమరచి చెప్పాడు. స్నేహానుభవాన్ని కూడా ఆయనే విడమరచి చెప్పేడు.

అంగా దంగా త్సృత ఇవ నిజోదేహజః స్నేహ సారః?
ప్రాదుర్భూయ స్థిత ఇవ బహిశ్చేతనాధాతు రేవ?
సాంద్రానందః క్షుభితహృదయ ప్రస్రవే నేవ స్పష్టో?
గాత్రంశ్లేషే యదమృతరస స్రోతసా సించతీవ. 6 - 15.

కుశుని పరిష్వంగంలో ఈ స్నేహానుభవం శ్రీరామునికి కలిగింది. కుశుని పరిష్వంగంతో నాశరీరం అమృత సరస్సులో స్నానమాడినట్లుంది. ఇతడు నా సర్వాంగముల నుండి స్రవించిన స్నేహసారమా? నా ప్రాణమే ఇలా నాముందు నిలిచి కన్నుల పండువు చేస్తూందా? సాంద్ర ఆనందం కరగి పారిన నా హృదయమే ఈ రూపంలో సృష్టింపబడిందా? - ఇది శ్రీరాముని స్నేహానుభవం అపత్య స్నేహానుభవము.

అపత్య స్నేహము అన్నిటికంటేగొప్పదని భవభూతి అభిప్రాయము. తృతీయాంకంలో తమస సీతతో ఈ సంగతి చెప్తుంది. ''ప్రసవః ఖలు ప్రకర్షపర్యన్తః స్నేహస్య. పరమం చైత దన్యోన్య సంశ్లేషణం పిత్రోః'' అన్న తమస మాటలు భవభూతి మాట్లాడుతున్నట్లే కనిపిస్తుంది. కానుపు స్నేహాతిశయానికి పరమావధి. తల్లిదండ్రుల నొకరినొకరికి సన్నిహితుల్ని చేసే దీనికి మించిన స్నేహ ప్రకర్ష వేరొకటి లేదన్న భవభూతికి భారతీయ కుటుంబ వ్యవస్థ పట్ల ఎంతటి గౌరవ మున్నదో, ఆయన ఎంతటి లోకవృత్త పరిశీలకుడో మనం ఈ మాటల వలన తెలుసుకో వచ్చును.

అంతః కరణ తత్త్వస్స దమ్పత్యోస్స్నేహసంశ్రయాత్
ఆనందగ్రంథి రేకోఽయ మపత్యమితి బధ్యతే. 3 - 11

దాంపత్య స్నేహానికేకాశ్రయము అపత్యము. తల్లి దండ్రుల అంతః కరణాల నేకంచేసే సంతోషపు ముడి అపత్యము. అన్న తమస మాటల వెనుక ఉత్తర రామ చరిత కావ్యేతి వృత్తమంతా దాగి వుంది. ఈ అపత్య స్నేహానికి మూలమైనది దాంపత్య స్నేహము.

భవభూతి తనకు తానుగా కల్పించిన ఈ దాంపత్య స్నేహబంధంలో భారతీయాత్మ అంతా గర్భితమై ఉంది. భార్యా భర్తలు స్నేహితుల్లా ఉండే ఆదర్శ దాంపత్యం సమాజంలో నెలకొనాలని గురజాడ కలగన్నాడు. ఆ కలను భవభూతి ఎప్పుడో సాకారం చేసేడు. సీతారాముల దాంపత్య స్నేహం ప్రపంచ సాహిత్యానికే వన్నె తెచ్చింది. వాల్మీకి, కాళిదాసుల్లో ఈ విషయం ఇంత వైభవాన్ని పొందలేదు. ఇతర సాహిత్యాలకు కూడా ఈ తీరు అచుంబితమైనది కావచ్చును.

కుశుడు లవునితో ''సచ స్నేహ స్తావాన్'' అంటాడు. సీతారాముల దాంపత్య స్నేహాన్ని గూర్చి. 'ఆ స్నేహమంతటిది' - అని ఒక రామాయణ పాఠకుడనడంలో - దానిని వాల్మీకి ఎంత ఉన్నతంగా ఉదాత్తంగా తీర్చిదిద్దాడో - తనకెలా మార్గదర్శకు డయ్యాడో కృతజ్ఞతా పూర్వకంగా తెలియజేయడానికే భవభూతి కుశుని నోట ఈ మాట ఇంత సంక్షిప్త సుందరంగా పలికించాడనిపిస్తుంది. జన స్థానంలో రాముని చూసినప్పుడు సీత ''అహమేతస్య హృదయం జానామి - మమఏషః'' అంటుంది. నా కాయన హృదయం తెలుసును ఆయనకు నా హృదయం తెలుసును అని ఆదశలో అనగలిగిన ఔన్నత్యం దాంపత్య స్నేహానికి సాధ్యం. రామునికి సీతపై అనుమానం లేదు. సీతకు రామునిపై కోపం లేదు. స్నేహమంటే అది. త్యాగ మంటే అది. తనతో పాటు అడవులకు వచ్చిన సీతను తలచుకుని రాముడు ''స్నేహస్తస్యాః సతాదృశః'' అంటాడు. రాముని కోసం అన్నీ వదలుకున్న స్నేహ మామెది. జన స్థానంలో సీతకు రాముని పట్ల గల స్నేహాన్ని చూసి తమస ఆమెను కౌగిలించుకుని ఇలా పలికింది.

విలులిత మతిపూరై ర్బాష్పమానందశోక
ప్రభవ ముపసృజంతీ తృష్ణయోత్తానదీర్ఘా
స్నపయతి హృదయేశం స్నేహ నిష్యందినీతే
ధవళ బహుళ ముగ్ధా దుగ్ధకుల్యేవ దృష్టిః

రాముని చూడగానే కలిగిన ఆనందం దుఃఖం నిండిన కన్నీళ్లు పొంగిపొరలి అతన్ని చూచే కోరికతో

నీ కళ్లింకా పొడవుగా వెడల్పుగా అయ్యాయట. తెల్లగా బహుళంగా అందంగా నీ చూపులోంచి పారలి వచ్చిన స్నేహ ప్రవాహం పాలకాలువ అయి శ్రీరాముని స్నానం చేయిస్తూంది అంటూంది తమస. సీత యందు రాముని స్నేహం ఇంతకు తగ్గినది కాదు. అది వాసంతి మాటలలో కనిపిస్తుంది.

''త్వం జీవితం, త్వమసి మే హృదయం ద్వితీయం
త్వం కౌముదీ నయనయో, రమృతం త్వమంగే'' -

నువ్వు నాప్రాణానివి. నువ్వు నా రెండో హృదయానివి. నువ్వు నా కన్నుల్లో వెన్నెలవి, నువ్వు నా శరీరంలో అమృతానివి - అన్నంత స్నేహం కదా నీది సీతనెలా విడిచి పెట్టావని వాసంతి ప్రశ్నిస్తుంది. జన స్థానంలో సీత రాముని స్పృశిస్తుంది. ఆ స్పర్శా స్నేహ శైతల్యాన్ని అనుభవిస్తాడు రాముడు.

ప్రసాద ఇవ మూర్తస్తే స్పర్శ స్స్నేహార్ద్ర శీతలః
అద్యాప్యానందయతి, త్వంపునః క్వాసి నన్దిని౹ 3.9

నందిని అంటే ఆనందాన్నిచ్చేది. ఓ సీతా రూపు దాల్చిన అనుగ్రహంలా ఉన్న నీ ఆర్ద్రమైన స్నేహ స్పర్శ ఇప్పుడు కూడా నాకు ఆనందాన్ని స్తూంది. నువ్వెక్కడున్నావు? అంటాడు రాముడు. రాముని ఈ మాటలు 'అగాధ దర్శిత స్నేహ సంభారము; 'అని సీత అంటుంది. ఇలా ఈ కావ్య మాద్యంతం సీతారాముల పరస్పర స్నేహాన్ని గాఢంగా చిత్రించింది.

శ్రీరాముడు తన దాంపత్య స్నేహానుభవాన్ని, స్నేహఫలాన్ని వివరించిన సందర్భాలు సంస్కృత సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచేవిగా ఉన్నాయి. భవభూతి దర్శించిన ఆ అనుభవాలు వేరొక కవి దర్శనానికి అందేవి కావు. గర్భభారాలస అయిన సీత రాముని కంఠం చుట్టూ చంద్ర కిరణాల్లో నానిన ముక్తాహారం లాంటి చేయిని చుట్టి నిద్రించింది. ఆమె స్పర్శలోని సుఖాన్ని గూర్చి రాముడిలా అంటాడు.

వినిశ్చేతుం శక్యో న సుఖ మితివా దుఃఖమితివా
ప్రబోధో నిద్రావా, కిము విష విషసర్పః కిముమదః?
తవ స్పర్శే స్పర్శే మమహి పరిమూఢేంద్రియ గణో
వికార శ్చైతస్యం భ్రమయతి సమున్మీలయతిచ. 1 - 28

సీత స్పర్శతో ఒక మానసిక వికారం కలుగుతూంది. ఇది సుఖమా, దుఃఖమా, మెలకువా, నిద్రా, విష మెక్కడమా, మైకం కలగడమా? నీ ప్రతి స్పర్శతోను నా శరీరం మోహ పరవశ మౌతూంది. నన్ను భ్రమింపజేస్తూంది, పెకలించి వేస్తూంది అంటాడు. ఆస్నేహానుభవం అనిర్వచనీయమైనది. ఆమె స్పర్శ ఇటువంటిది. ఆమె మాటలెటువంటివి?

మ్లానస్య జీవకుసుమస్య వికాసనాని - సంతర్పణాని సకలేంద్రియ మోహనాని
ఏతానితే సువచనాని సరోరుహాక్షి - కర్ణామృతాని మనసశ్చరసాయనాని. 1.29

నీ మాటలు వాడిన జీవన కుసుమాన్ని వికసింప జేస్తాయి. సకలేంద్రియాలను పరవశింపజేస్తాయి. చెవులకు విందుచేస్తాయి. మనసుకు ఉల్లాసాన్నిస్తాయి అన్నాడు రాముడు. పెళ్లయిన దగ్గర నుండి

సీతకు రాముని బాహువే తలగడ అయింది. ప్రత్యక్షంగా ఆమెతో మాట్లాడుతూ తన స్నేహానుభవాన్ని వెల్లడించడంతో రాముడు తృప్తిపడలేదు, ఆమె నిద్రించిన తరువాత తనలో తాను ఇలా అనుకున్నాడు.

ఇయంగేహే లక్ష్మీ, రియ మమృతవర్తిర్నయనయో,
రసా వస్యా స్స్పర్శో వపుషి బహుళ శ్చందనరసః
అయం కంఠే బాహుః శిశిర మస్బణో మౌక్తిక సరః
కి మస్యాన ప్రేయో యది పర మసహ్యాస్తు విరహః 1 - 31.

ఈమె నా గృహలక్ష్మి, ఈమె నా కన్నుల అమృత శలాక, ఈమె స్పర్శ నా శరీరానికి చందన చర్చ. నా మెడచుట్టూ అల్లుకున్న ఈమె బాహువు చల్లగా అందంగా ఉన్న ముత్యాలహారం. ఈమెకు చెందిన వన్నీ నాకు ప్రియములే. ఈమె ఎడబాటు మాత్రం భరింపరానిది. ఈ శ్లోకం భార్యా భర్తృ సంబంధ నిరూపణలో పరాకాష్ఠ నందినది. భవభూతికి ముందు వెనుకలుగా ఈ భావాన్ని ఇంత మనోహరంగా చెప్పినవారు లేరు. ఇక్కడే శ్రీరాముడు దాంపత్య మంటే ఏమిటో , ఎలా ఉండాలో వివరిస్తాడు.

అద్వైతం సుఖ దుఃఖయో, రనుగతం సరాస్వవస్థాసు య
ద్విశ్రామో హృదయస్య యత్ర, జరసాయస్మిన్నహార్యోరసః
కావే నావరణాత్య యాత్పరిణతే యత్స్నేహ సారేస్థితం
భద్రం తస్య సుమానుషస్య కథమప్యేకంహి తత్ప్రార్థ్యతే. 1 - 32

సుమానుష మంటే ఇక్కడ దాంపత్యము. సుఖ దుఃఖాలలో ఒకటిగా ఉండేది. అన్ని అవస్థలలోను అనుసరించి వుండేది. మనసుకు ఊరట కల్పించేది. ముసలితనంతో పోయేది కానిది, కాలం కప్పే ముసుగులన్నీ తొలగుతూన్న కొద్దీ పరిణతి పొందే స్నేహ సారంగా నిలిచేది - క్షేమకరమైన ఆ దాంపత్యము అన్ని విధాలా కోరదగినది. భార్య అంటే 'సౌహృదా దపృథగాశయా' అన్నాడు రాముడు. స్నేహం కంటే వేరైన ఆశయం లేనిదని అర్థము. అంతటితో ఆగితే అది ఏక పక్షంగా ఉంటుంది.

ప్రేయోమిత్రం బంధుతా వాసమగ్రా - సర్వే కామాః శేవధి ర్జీవితంవా
స్త్రీణాం భర్తా దర్మ దారాశ్చ పుంసా - మిత్యన్యోన్యం వత్సయోర్ జ్ఞాతమస్తి

భార్యాభర్తలు ఒకరినొకరు మిత్రము, బంధువు అని భావించాలి. ఒకరి కోసం ఒకరు కోరికల్ని సంపదను చివరకు ప్రాణాల్ని సైతం వదులుకోగలగాలి. స్వార్థం ఉండకూడదు. స్థిరంగా ఉండాలి. కాలం గడుస్తూన్న కొద్దీ పెరుగుతూ ఉండాలి. పరస్పర ఆనంద హేతువుకావాలి. అదే ఆదర్శ దాంపత్యమని భవభూతి అభిప్రాయం. ఈ అభిప్రాయానికి లక్ష్యంగా సీతారాముల దాంపత్య స్నేహాన్ని తీర్చి దిద్దేడు.

ఉత్తర రామ చరితలో బంధు స్నేహం కూడా ఉదాత్తంగా కనిపిస్తుంది. లవ చంద్రకేతుల మధ్య; శ్రీరాముడు, కుశలవుల మధ్య ఈ స్నేహభావమెట్లా ప్రకటితమయిందో ఇంతకు ముందే వివరించబడింది. అంతకు మించిన ఉన్నత బంధు స్నేహ సంబంధ మిందులో ఉంది. జనకుడు దశరథుడు వియ్యమందినవారు. ఇక్కడి స్నేహాని కొక పరిమితి ఉండాలి. కాని ఉత్తర రామ చరితలో ఆ స్నేహ సంబంధం అతి వేలంగా కనిపిస్తుంది. జనకునికి వాల్మీకి స్నేహితుడట. వాల్మీకి ఆశ్రమానికి

వచ్చిన జనకుడు కౌసల్యను చూచి ''హా! కథ! మియం మహారాజ దశరథస్య ధర్మదారాః ప్రియసఖీమే కౌసల్యా'' అంటాడు. కౌసల్య జనకునికి ''ప్రియసఖి'' అట. అది ఎంతటి నిర్మలమైన స్నేహమో మనం అర్థం చేసుకోవాలి. కూతురి కాపురం కల్లోలితమైన సందర్భంలో, ఆమె మరణించి ఉంటుందని అనుకునే సందర్భంలో జనకుడు కౌసల్యను చూచి ఇలా ఆలోచించడం ఎంతటి ఉన్నత సంస్కారమో మనం తెలుసుకోగలగాలి. వారి స్నేహం అంతటితో ఆగలేదు. జనకునకు దశరథుడు కూడా ప్రియ సుహృదుడే.

స సంబంధీ శ్లాఘ్యః, ప్రియసుహృదసౌ, తచ్చ హృదయం,
స చానంద స్సాక్షాదపి చ నిఖిలం జీవిత ఫలమ్
శరీరం జీవో వా యదధిక మతో వా ప్రియతరం
మహారాజ శ్రీమాన్ కిమివ మమ నాసీ ద్దశరథః

దశరథుడు గొప్ప వియ్యంకుడు. ప్రియమిత్రుడు రూపుదాల్చిన ఆనందము. అతడు నా హృదయము సమస్త పురుషార్థము. శరీరము, ప్రాణము - అతడు నాకేమి కాడు! అన్నాడు జనకుడు. ఇందుకు బదులుగా. కౌసల్యా దశరథులు జనకుని యందెంతటి సుహృద్భావాన్ని ప్రకటించారో కూడా తెలుసు కోవాలి.

యదస్యాః పత్యుర్వా రహసి పరమం దూషిత మభూ
ద భూవం దంపత్యోః పృథగహము పాలంభ విషయః
ప్రసాదే కోపే వా తదను మదధీనో విధి రభూ
దలం వా తత్స్మృత్వా! దహతి య దవస్కన్ద్య హృదయమ్.

కౌసల్యా దశరథుల మధ్య నెలకొన్న రహః కలహాలకు తీర్పరిగా జనకుడుండేవాడు. ఆ దంపతులు ఒక రొకరుగా వచ్చి జనకుని వద్ద పరస్పరారోపణలు చేసుకునేవారు. వాళ్లకు కోపం వచ్చినప్పుడు, కోపం పోయినప్పుడు గాని తీర్పరిగా జనకుడే ఉండేవాడు. అది ఆ దంపతులకు జనకుని పట్ల స్నేహభావన. బంధు స్నేహానికింతకంటె ఉదాహరణం ఉండదు.

గంగ - గోదావరి - తమస - మురళ అనే నదులు వాసంతి అనే వన దేవత ఈ నాటకంలో పాత్రలు. మనిషికి ప్రకృతికి; మనిషికి దైవానికి ఉండే అవిభాజ్యము, అమూల్యము అయిన స్నేహ సంబంధాన్ని స్థాపించడానికి భవభూతి ఈ పాత్రలను కల్పించేడు. ఇదంతా ఒక అద్భుత నేపథ్యం. కరుణ రసం ఎప్పుడూ అద్భుత రస నేపథ్యంతో పరిపుష్టం కావాలని ఆలంకారికుల అభిప్రాయం. ఒక అతి మానుషమైన - దైవీయమైన స్నేహ ప్రకృతిని ఈ పాత్రల ద్వారా భవభూతి మానవాళికి పరిచయం చేసి పోయాడు. వీరికి తోడు లోపాముద్ర - అరుంధతి - ఆత్రేయవంటి ఋషి ప్రకృతులున్నారు. ఈ అందరికీ సీతారాముల పట్ల, వారి సంతతి పట్ల అవ్యాజ స్నేహము. వీరే సీతారాముల పునస్సమాగమానికి, కుమార ప్రత్యభిజ్ఞానానికి అవసరమైన నేపథ్య రచన చేసినవారు. దండకారణ్య వనవాస సమయంలో వాసంతి అనే వన దేవత సీతకు ప్రియసఖి అయింది. ''ఉచితమేవ దాక్షిణ్యం స్నేహస్య'' అంటుంది మురళ. ఆ దాక్షిణ్యంతోనే వీరందరూ సీతారాముల పునస్సమాగమానికి త్రోవలు తీసారు. లోపాముద్ర రాముని సేదదీర్చమని గోదావరిని అభ్యర్థించడానికి మురళను పంపింది.

రాముడు జన స్థానానికి వచ్చాడని సరయూ ముఖంగా విన్న భాగీరథి ''యదేవ లోపాముద్రయా స్నేహ వశాదాశంకితం తదేవాశంక్య'' సీతను తీసుకొని ఏవో ఇంటి పనుల మిషతో గోదావరిని చూడడానికన్నట్లుగా వచ్చింది. భాగీరథి సీతా గాఢ స్నేహోద్వేజితుడైన శ్రీరాముడు జనస్థానంలో గోదావరీ పరిసరాలను దర్శించినపుడు సెల వేసిన పూర్వ స్నేహ స్మృతులను తట్టుకుని నిలువలేడని, ఆయనను సేద దీర్చడానికి లోపాముద్ర నియోగించిన తమసకు సాధ్యపడదని, ఒక్క సీత మాత్రమే శ్రీరాముని కాసమయంలో కలిగేగాఢమోహం నుండిపునర్జీవితుణ్ణిచేయగలదని ముందుగా ఆలోచించి సీతనక్కడకు తీసుకుని వచ్చింది. వనదేవతకు కూడా అగపడకుండా ఉండే తిరస్కరిణీ శక్తిని సీతకు ప్రసాదించింది. సీతకు తమస, మురళ బాసటగా నిలిచేరు. రామునికి వాసంతి సహాయకురాలిగా నిలిచింది. దాక్షిణ్యమంటే ఏమిటో భవభూతి భారతీయులకు ఛాయాంకం ద్వారా పరిచయం చేసేడు. ''సర్వదా ఋషయో దేవతాశ్చ శ్రేయో విధాస్యంతి'' అంటాడు భవభూతి. అంతేకాదు ''సకరుణాహిగురవో గర్భరూపేషు'' అన్న అంశాన్ని వాల్మీకి కల్పించిన, సదేవాసుర తిర్య గురగ నరనికాయంతో అద్భుతంగా సృష్టించిన అంతర్నాటకంతో సీతారామ పునస్సమాగమాన్ని సంఘటించి ఫలశ్రుతిని పలికేడు. ఋషులు దేవతలు మాత్రమే గాక స్థావర జంగమ ప్రకృతి సైతం స్నేహహస్తం అందించినపుడే మానవ జీవితం పరిపూర్ణసుఖాన్ని పొందగలదు. మనిషి ప్రకృతితో స్నేహంగా ఉండాలి - ప్రకృతిని ఆరాధించాలి అన్న సందేశాన్ని ఉత్తర రామ చరిత నాటకం అందిస్తూంది.

సీత భూపుత్రి అడవిలో వదలిపెట్టినప్పుడు శ్రీరాముడామెను భాగీరథికి అప్పగించేడు. జనస్థాన వనదేవత ఆమెకు ప్రియసఖి. అంతేకాదు అడవిలో ఆమె ఒక ఏనుగు గున్నను పుత్రకల్పంగా పెంచింది. ఆమె పెంచిన కడిమి చెట్లు, నెమలి అన్నాచెల్లెళ్లలా పెరిగేయి. సీత కథ ఇది. శ్రీరాముని కథ ఇంకోలా ఉంది. గోదావరీ తీరంలోని 'ద్రుమా ఆపి మృగా ఆపి బంధవోమే'' అంటాడు శ్రీరాముడు. 'హన్త! పరిహర్తన మపి మామితః పంచవటి స్నేహో బలాదాకర్షతీవ'' అంటాడా మర్యాదా పురుషోత్తముడు. ''తాన్ పూర్వసుహృదో భూమిభాగాన్ పశ్యామి'' తన పాత మిత్రులను పలకరించడానికి వెళ్తాడు.

పురాయత్ర స్రోతః పులిన మధునా తత్రసరితాం
విపర్యాసం యాతో ఘన విరలభావః క్షితిరుహాం
బహోర్దృష్టం కాలా దలర మివ మన్యే వన మిదం
నివేశ శ్శైలానాం తదిదంబుద్ధిం ద్రఢయతి.

పూర్వం నదులు పారిన చోట ఇప్పుడు ఇసుక దిబ్బలున్నాయి. పూర్వం దట్టమైన అడవి ఉండే చోటు ఇప్పుడు బీడు పడింది. ఎన్నాళ్ళకో చూసిన ఈ చోటు ఇంకొక చోటులా కనిపిస్తుంది. కొండలు మాత్రం ఇది జనస్థానమే అని చెప్తున్నాయి అంటాడు శ్రీరాముడు. ఆయనకు కొండలు తప్ప ఇతర మిత్రులు కనబడలేదు. తన జీవితంలాగే ఈ ప్రకృతి కూడా మారిపోయింది, అనుకున్న శ్రీరామునిలో తుల్యమైన అనుభవ - జీవన గమనంలో ప్రతి వ్యక్తికి ఎప్పుడో ఒకప్పుడు ఎదురౌతుంది. దానినే విధి అంటారు. కంచుకి ఈ విధి వ్యాపారాన్ని వివరిస్తాడు.

సుహృదివ ప్రకటయ్య సుఖప్రదః ప్రథమ మేకరసామనుకూలతామ్
పునరకాండ వివర్తమానదారుణో - విధి రహో విశినష్టి మనోరుజమ్.

విధి స్నేహితుడిలా మార్పులేని ఇష్టాన్ని కూర్చి హితం చేసేదిగా కనిపిస్తుంది. అకస్మాత్తుగా అహేతుకంగా మారి దారుణమైన మనో వ్యథను కలిగిస్తుంది. అన్న కంచుకి మాట ఉత్తర రామ చరిత కథా సూత్రాన్ని సూచిస్తే శ్రీరాముని జనస్థాన వర్ణన దానిని అనుభవ పూర్వకంగా ఆవిష్కరించింది. ఇది ఒక సంస్కృతికి కూడా వర్తిస్తుంది. విధివశాన ఎదురైన ఆటుపోట్లను ఎదుర్కొని అటు శ్రీరాముడు జనస్థాన పర్వతంలా నిలిచి ఉన్నాడు. ఇటు ఉత్తర రామ చరిత వంటి నాటకాలింకా నిలిచి ఉన్నాయి. కాల పరీక్షకు నిలిచినదే ఉన్నత సంస్కృతి, ఉదాత్త సాహిత్యం.

మిత్రునిలా ఉన్న విధి శత్రువుగా మారడానికి కూడా స్వల్పమైన హేతువులుంటాయి. అందులో అవచనీయత - అంటే అనకూడని మాట ఒకటి.

సర్వథా వ్యవహర్తవ్యం కుతోఽ ప్యవచనీయతా
యథా స్త్రీణాం తథా వాచాం సాధుత్వేదుర్జనో జనః 1 - 5

ఏ నిందనైనా భరించక తప్పదు స్త్రీల విషయంలోను, వాగ్రచనల విషయంలోను. దుర్జనులు ఏదో ఒక తప్పు పడుతూనే ఉంటారు అన్న సూత్రధార వచనం అటు సీతారాముల విషయంలోను ఇటు భవభూతి విషయంలోను నిరూపితమయింది. జనాపవాదమనే ఒక నిప్పురవ్వ ఎంతటి స్నేహవనాన్ని దహించడానికి జిహ్వాజ్వాలలు ప్రసరింపజేసిందో నాటకమంతా కనిపిస్తుంది. కరుణరసం ఆ జ్వాలను ఆర్పింది. ద్వేషాన్ని ద్వేషంతో ప్రతిఘటించకూడదన్న ప్రబంధార్థాన్ని ఈ నాటకం ద్వారా అందించడానికి భవభూతి ఎంతకాలం మథనపడ్డాడో తన రచనలను తిరస్కరించిన వారిని ఆయన ఉత్తర రామ చరిత రచనతోనే ఎదుర్కొన్నాడు. తన ఔద్ధత్యాన్ని అంతర్గర్భితం చేసుకుని ప్రసాదశబలితమైన కరుణరస ప్రస్థానంతో అజరామరమైన నాటక సృష్టి చేసేడు. స్నేహసారంతో శీతల మసృణమైన కావ్యవనాన్ని పెంచి శాశ్వతకాలం అనుభవించవలసిందిగా మనను ఆహ్వానిస్తూ నిలిచిపోయాడు.

యథేచ్ఛం భోగ్యం వో వన మిద మయం మేసుదివస
స్సతాం సద్భి స్సంగః కథమపిహి పుణ్యేన భవతి
తరుచ్ఛాయా తోయం యదపి తపసోయోగ్య మశనం
ఫలం వా మూలం వా తదపి న పరాధీన మిహవః

నేడు సుదినం. సజ్జన స్నేహం పుణ్యం చేసుకుంటేనే దొరుకుతుంది. ఈ వనం మీది. జంకు గొంకు లేకుండా ఈ వనాన్ని అనుభవించండి. చెట్లనీడలు, సెలయేళ్లనీళ్లు, తపస్సుకు తగిన భోజనం, పళ్లు, దుంపలు మీకు ఏది కావాలంటే అవి తీసుకోండి. ఇక్కడ మీది కానిదేమీ లేదు. అని ఆహ్వానించే వనదేవతలా కనిపిస్తుంది. స్నేహపూర్ణమైన సృష్టితో నిండిన ఉత్తర రామ చరితము. ఈ అతిథి సంసేవనం సనాతన భారతీయ ధర్మం. అది ఏ ఒక్కరికో సొంతం కాదు, అందరిదీ. ఆ భావనే వైర భావాన్ని సమయింపజేసి స్నేహభావాన్ని పెంచి పోషిస్తుంది. ఇంతటి మహార్థాన్నందించే రచననే మహా కావ్యమనాలి. భవభూతి మహాకవి.

# రుచి

– వింజనంపాటి రాఘవరావు

'ఓ రామ నీ నామమెంతో రుచిరా' అంటూ పరవశంతో పాడుతున్న భక్తుడితో 'రాత్రి రుచి చూశానయ్యా. నాకు మాత్రం చప్పగా ఉంది. నీకు అంత రుచిగా ఎలా ఉంది నామం' అని అడిగాడట ఓ అమాయకుడు.

'పృధ్వీ సుగంధా, సరసస్తాపః' అంటూ నిత్యం ప్రాతఃస్మరణలో మనం చదువుకుంటాం. వాసనను కలిగి ఉండేది భూమి అని, రుచిని కలుగజేసేది నీరు అని దాని అర్థం. ఏ పదార్థాన్నైనా మనం రుచి చూడాలంటే అది తప్పని సరిగా నీటిలో కరగాల్సిందే. రుచిని కలుగజేసేది నీరు అయితే రుచిని గ్రహించే అవయవం నాలుక.

'కమ్మటి రోగాలూ, తియ్యటి మందులూ ఉండవు' అన్న నానుడి మనకు తెలిసిందే. రుచికరంగా లేని వస్తువును నాలుక తిరస్కరిస్తుంది. 'తినగ తినగ వేము తియ్య నుండు' అంటూ 'సాధనమున ఏ పనైనా సాధించవచ్చు'నంటారు యోగి వేమన.

'పుర్రెకో బుద్ధి. జిహ్వకో రుచి' అన్నది సామెత. భౌతికమైన పదార్థాల రుచిని గ్రహించేది నాలుక. భావ ప్రధానమైన విషయాల రుచిని గ్రహించేది మనస్సు. ఏ ఇద్దరూ ఒక పదార్థాన్ని ఒకే రకంగా ఆస్వాదించలేరన్నది సత్యం. పుట్టిన బిడ్డ నుండి, వయో వృద్ధుల వరకూ రక రకాల రుచులతో విడివిడిగా వండి వార్చలేక ఇల్లాళ్ళు పడే ఇబ్బందులు అందరికీ తెలిసినవే.

మనం తినే ఆహారం రుచి మన మొహంలో కన్పిస్తుంది. దీన్నుంచే 'ఆముదం త్రాగిన ముఖం' వంటి పదబంధాలు ఏర్పడ్డాయి.

రోజూ షడ్రసోపేతమైన భోజనం చేయాలనేది శాస్త్ర కారుడి మాట. ఆరు రుచులతో కూడిన భోజనం ఆరోగ్యాన్ని కలుగజేస్తుంది. కాని మన నాలుక ప్రధానమైన రుచులనే గుర్తిస్తుంది. అవి తీపి, ఉప్పు, పులుపు మరియు చేదు. కారం, వగరులను నాలుకపై ప్రత్యేమైన స్థలంలో గుర్తించలేం.

నాలుక చివరి భాగంతో తీపిని, నాలుక అంచు వెంట కొంత దూరం వరకు ఉప్పదనాన్ని, అక్కడి నుండి నాలుక మొదలు వరకు పులుపును, నాలుక మూలం మధ్య భాగంలో చేదును గ్రహిస్తుంది.

ఆహారం శరీరంలోకి ప్రవేశించే ముఖ ద్వారం నోరు. నోట్లో ఉన్న నాలుక ఏ పదార్థం లోపలికి వెళ్ళాలి, ఏది వెళ్ళకూడదు అనే విషయం నిర్ధారిస్తుంది.

మనం తినే పదార్థపు స్వభావం - గట్టిగా ఉందా మెత్తగా ఉందా, ఉష్ణోగ్రత - వేడిగా ఉందా, చల్లగా ఉందా, తినటానికి పనికి వచ్చేదేనా మొదలైన విషయాలన్నింటినీ గుర్తించి, గమనించి ఆ పదార్థం తినయోగ్యమైనదో కాదో తేలుస్తుంది.

అంతే కాదు మనం ఆహారం నమిలే సమయంలో ఆహారాన్ని పండ్ల మధ్యకు తోస్తుంది.

---

వింజనంపాటి రాఘవ రావు, జంతు శాస్త్రోపన్యాసకుడు, ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాల, హిందూపురం, అనంతపురం జిల్లా.

పళ్ళలో ఇరుక్కున్న ఆహారాన్ని బయటకు తీసే ప్రయత్నం చేస్తుంది. కొన్ని జంతువులలో శరీరాన్ని శుభ్రం చేయటానికి ఉపయోగపడే ప్రధాన సాధనం నాలుకే.

కప్ప, ఊసరవెల్లి, ఏంట్ ఈటర్ (Ant Eater) వంటి జీవులలో నాలుక పొడవుగా ఉండి దూరంగా ఉన్న ఆహారాన్ని అందుకోవటంలో సాయపడుతుంది.

పాములు, కొన్ని రకాల తొండలలో వాసనను గ్రహించే ప్రధాన సాధనం నాలుకే.

జీవులలో వివిధ రకాల పనులను నిర్వహిస్తున్న ఈ జ్ఞానాంగాన్ని గురించి మరికొంత తెలుసుకుందాం.

నాలుక రుచిని ఎలా గ్రహిస్తుంది? మన నాలుక కొంత గరుకుగా ఉండటం గమనించారా? ఈ గరుకు దనాన్ని కలుగ జేసేవి 'టేస్ట్ బడ్స్' అనే రుచి గ్రాహకాలు. ఇది మన నాలుకపై పదివేల వరకూ ఉంటాయి. ఏదైనా ఆహార పదార్థం నీటిలో, లేదా లాలాజలంలో కరిగి ఈ రుచి గ్రాహకాలుండే గుంటలలోకి ప్రవేశిస్తుంది. అక్కడ ఉండే 'రిసెప్టార్లు' రుచిని గ్రహించి క్రింద ఉండే నాడుల ద్వారా ఈ సమాచారాన్ని మెదడుకు చేరుస్తాయి.

ఏ జీవిలోనైనా సాధారణంగా జరిగే ప్రక్రియ ఇది. కొన్ని అసాధారణ పరిస్థితులలో మనం రుచిని సరిగా గుర్తించలేం.

పదార్థం బాగా వేడిగా ఉన్నా, బాగా చల్లగా ఉన్నా రుచి తెలియదు. అలాగే మనం తమల పాకులు, పొగాకు వంటి పదార్థాలు తిన్నప్పుడు అవి నాలుకపై ఒక పూత లాగా ఏర్పడి రుచి గ్రాహకాలలోనికి మనం తినే ఆహారం చేరదు. మనకు ఆ పదార్థం రుచి తెలియదు.

అలాగే అతి వేడి పదార్థాలు తినటం వలన రుచి గ్రాహకాలు కాలి నిర్జీవమౌతాయి. క్రొత్త గ్రాహకాలు ఏర్పడే వరకు మనకు రుచి తెలియదు. ఇది మనందరకూ అనుభవంలోని విషయమే.

జంతు ప్రపంచంలో నోట్లో నాలుక లేని జీవులూ ఉన్నాయి. మరి అవి రుచిని ఎలా గ్రహిస్తాయి? కొన్ని చేపలలో ఘ్రాణావయవాలే రుచి గ్రాహకాలుగా పని చేస్తాయి. Cat Fish అనే మీసాలుండే చేపలలో ఈ రుచి గ్రాహకాలు శరీరం పైన ఉంటాయి. సీతాకోక చిలుకలలో ఇవి TARSI పైన, ఇతర కీటకాలలో జంభికల పైన ఉంటాయి.

నిమ్న జాతి జీవులలో ఈ నాలుక అనే అవయవమే లేదు. నోటి కుహరపు గోడలలో రుచి గ్రాహకాలుండి పదార్థపు రుచిని తెలియజేస్తాయి.

ఇక రుచి విషయానికొస్తే మన నాలుక తీపి కంటే చేదుకు 8,000 రెట్లు సున్నితత్వం కలిగి ఉంటుంది.

మనం ఒక పాలు చక్కెరకు 2,000 పాళ్ళు నీళ్ళు కలిపినా తీపిని గుర్తించగలం. అలాగే ఉప్పును 400 పాళ్ళ వరకు, ఆమ్లాన్ని 1500 పాళ్ళ వరకు స్ట్రెకినిన్ (Strichnin) అనే పదార్థాన్ని ఇరవై ఐదు లక్షల పాళ్ళ వరకు నీరు కలిపినా వాటి రుచి గుర్తించగలం.

అయితే మనం రుచిని ఎంత బాగా గుర్తించగలం అనే విషయం మన శరీరంలోని జన్యువులపై ఆధారపడి ఉంటుంది. కొందరు PTC (పి.టి.సి) అనబడే 'ఫినైల్ థయో కార్బమైడ్' అనే చేదు

పదార్థపు రుచిని గుర్తించలేరు. అలాంటి వారిని రుచ్యంధులు(?) అనవచ్చు. వీరిలో ఒకానొక జన్యువు లోపించటం వలన రుచిని గుర్తించలేరు. ఈ లక్షణం వంశ పారంపర్యంగా వస్తుంది.

మీరు నాలుకను నిలువుగా గుండ్రంగా చుట్టగలరా? ప్రయత్నించి చూడండి. నాలుకను నిలువుగా మడవటానికి కూడా ఒక జన్యువు కారణం. ఈ జీన్ లోపించినవారు నాలుకను నిలువుగా మడవలేరు.

ఆవు, మేక వంటి క్షీరదాల కంటే తాబేళ్ళ వంటి సరీసృపాలు 'ఆల్కలాయిడ్'లనే చేదు పదర్థాల రుచి మామూలు కంటే 30 రెట్లు ఎక్కువగా ఉంటే తప్ప గుర్తించలేవు. అందుచేత శాకాహారులైన రాక్షస బల్లుల శరీరంలో ఈ ఆల్కలాయిడ్‌లు విపరీతంగా పేరుకొని పోయి రాక్షస బల్లులు ఒకేసారి చనిపోయి ఉండవచ్చునేది ఒక సిద్ధాంతం.

మనం ఉదయాన్నే తీసుకొనే కాఫీ, టీ లలోను, పొగాకులోను, మేప, గన్నేరు వంటి మొక్కలలోను ఆల్కలాయిడ్లు పుష్కలంగా ఉన్నాయి. అందు వలననే వాటి ఆకులు చేదుగా ఉంటాయి.

టీ పొడి, కాఫీ పొడి, బ్రాంది, విస్కీ వంటి మద్యాలు తయారు చేసే ఫ్యాక్టరీలలోను, చాక్లెట్లు తయారు చేసే పరిశ్రమలోను టేస్టర్స్ (Tasters) అనే ప్రత్యేక ఉద్యోగులుంటారు. వారి పని కంపెనీ తయారు చేసిన పదార్థం కంపెనీ ప్రకటించిన నాణ్యతకు దగ్గరగా ఉందా లేదా అని రుచి చూసి చెప్పటం.

అయితే Tasters ముందుగా పదార్థపు రంగును చూస్తారు. తర్వాత దాని వాసన చూస్తారు. చివరగా ఆ పదార్థాన్ని రుచి చూస్తారు. అప్పటికి వారు ఆ పదార్థం గురించి పూర్తిగా విశ్లేషించ గలుగుతారు. అంటే నాలుకతో పాటుగా కన్ను, ముక్కు కూడా కలిస్తేనే ఏ పదార్థం రుచినైనా సరిగా అంచనా వేయగలం. అందుకే వ్యాపారులు ఆహార పదార్థాలకు కంటికి నదురుగా ఉండే రంగులను కలుపుతారు.

రంగు, వాసనల ప్రభావంలో పడి ముప్పై ఏళ్ళ క్రితం వరకు కాకులు సబ్బుల్ని (Soaps) పట్టుకు పోతుండేవి - అవి తినటానికి పనికొస్తాయేమోనని. ఈ మధ్య కాలంలో అవి కూడా తెలుసుకున్నాయి. సబ్బు తినటానికి పనికి రాదని.

రంగు, వాసనలు బాగున్నా రుచి బాగా లేక పోతే ఆ పదార్థాన్ని తినలేం. అందుకే కన్ను, ముక్కు సరేనన్నా, ఆహారాన్ని తిస్కరించే 'వీటో' పవర్ మాత్రం నాలుకదే.

పదార్థం ఎదురుగా లేకపోయినా ఆ పదార్థం రుచి మన మనస్సుకు గుర్తొచ్చినా చాలు నోట్లో నీరూరుతుంది.

ఇంతకీ నోట్లో నీరు ఎందుకు ఊరుతుంది? తినటానికి పనికి వచ్చే వస్తువు దగ్గరగా ఉన్నప్పుడో దాని వాసన ముక్కుకు సోకినపుడో సహజంగానే లాలా జలం ఊరుతుంది. అంటే ఆహారం తీసుకోవటానికి శరీరం - అనగా మన జీర్ణ వ్యవస్థ. సిద్ధమైనదన్న మాట. ఈ విషయాన్నే కుక్కలపై పరిశోధించిన 'ఐ.వి. పావ్‌లోవ్' (I.V. Pavlov) అనే శరీర ధర్మ శాస్త్రవేత్త Conditioned Reflex అనే సూత్రాన్ని ప్రతిపాదించాడు. ఈ Conditioned Reflex కేవలం శరీరానికి సంబంధించినదే కాదు. మనస్సుకు సంబంధించినది కూడా అని శాస్త్రజ్ఞులు నిరూపించారు.

ఒకసారి కడుపు నిండా తిన్న తర్వాత మనకెంత ఇష్టమైనా, ఎంత రుచి గల పదార్థాన్నైనా 'మరి కాస్త' తినలేం. భోజనం పెట్టడం ద్వారా మాత్రమే ఎదుటి వ్యక్తి చేత 'ఇక చాలు' అని అనిపించవచ్చు. అందుకే అన్నారు' అన్ని దానములలోనూ అన్నదానమె గొప్ప' అని.

మన శరీరారోగ్యం మన నాలుకపై ఆధారపడి ఉన్నది. శరీరానికి ఏ పదార్థాలవసరమో వాటినే నాలుక గ్రహిస్తుంది. మేకలు, పశువులు, దుకాణాల వద్ద ఉప్పు తినటం గమనించారా? పెంపుడు పశువులకు క్రమం తప్పకుండా ఉప్పును ఆహారంలో ఇవ్వటం రైతు సోదరులకు తెలిసిన విషయమే. అలాగే గ్రుడ్లు పెట్టే నాటు కోళ్ళు గోడకున్న సున్నాన్ని పొడుచుకుని తింటాయి. (చక్కెర వ్యాధి) Diabetes మధు మేహంతో బాధపడే వాళ్ళు తీపి పదార్థాల్ని ఎక్కువగా ఇష్టపడతారు. ఎండా కాలం మనం దాహంతో నీటి కోసం తపించి పోతాం.

శరీరంలో ఏ పదార్థం తగ్గితే ఆ పదార్థపు లోటును పూడ్చటానికి నాలుక ఆ పదార్థం ఎక్కువగా ఉన్న ఆహారాన్ని ఎక్కువగా గ్రహిస్తుంది. పైన మనం చెప్పుకున్న ఉదాహరణలన్నీ దీనికి సంబంధించినవే.

శాకాహారుల ఆహారంలో ఉప్పు సరిపడినంత దొరకదు. ఉప్పు లేక పోతే నాడీ వ్యవస్థ ఇతర వ్యవస్థలు దెబ్బ తింటాయి. అందుకే శాకాహారులు ఉప్పు కోసం తహ తహ లాడి పోతాయి. ఉప్పు కోసం జంతువులు అడవుల్లో కొన్ని కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తాయి. ఉప్పు లోటు భర్తీ చేసుకోవటం కోసం చవుడు తింటాయి. మాంసాహారులకు ఉప్పు వాటి ఆహారం ద్వారా లభిస్తుంది.

అలాగే గ్రుడ్లు పెట్టే కోళ్ళ ఆహారంలో క్యాల్షియం- అంటే-సున్నం అవసరం. లేకపోతే గ్రుడ్డు పై పొర మెత్తగా ఉంటుంది. వీటిని తోలు గ్రుడ్లంటారు. వీటి నుండి పిల్లలు బయటకు రావు.

ఇక డయాబిటిస్ వ్యాధి గ్రస్తుల రక్తంలో చక్కెర పరిమాణం తగ్గిపోగానే వారు తీపి పదార్థాల కోసం వెంపర్లాడతారు.

శరీరంలో నీటి శాతం గణనీయంగా పడి పోగానే నాలుక పిడచ గట్టుకు పోయి గ్రుక్కెడు నీళ్ళ కోసం మనం పరితపించి పోతాం.

అలాగే మద్యపాన ప్రియులలోనూ, పొగ త్రాగేవారిలోనూ శరీరంలో ఆల్కహాల్, నికోటిన్‌ల శాతం తగ్గగానే వాటి లోటును పూడ్చటానికి ఏ పని చేయటానికైనా సిద్ధమౌతారు. పై విషయాలను ఎలుకలలో ప్రయోగాత్మకంగా నిరూపించారు.

మన నాలుక ఏ రకమైన ఆహార పదార్థాలను ఇష్ట పడుతుందో దానిపై మన మనస్తత్వం ఆధారపడుతుందని భగవద్గీతను చదివితే మన కర్థమౌతుంది.

చిక్కనైనవి, ఆహ్లాదాన్ని కలిగించేవి, రసవంతమైన శక్తిని కలిగించే ఆహారాన్ని సాత్వికులు ఇష్టపడతారట.

అతి వేడి, కారం, ఉప్పు కలిగిన దుఃఖాన్ని శోకాన్ని కలిగించే రాజస ప్రకృతి గల వారు ఇష్టపడతారట.

ఇక్కడ ఇష్టపడటం వేరు తప్పని పరిస్థితిలో తినటం వేరు అన్న విషయం గమనించాలి.

వ్యాధిని గుర్తించటానికి డాక్టర్ల పరీక్షకు లోనయ్యే ఇంద్రియం నాలుక. గులాబి రంగులో ఉండవలసిన నాలుక రంగు మారినా, నాలుకపై పూత ఏర్పడినా శరీరం వ్యాధి గ్రస్తమైనదన్నమాట. నాలుక రంగును బట్టి వైద్యులు రోగ నిర్ధారణ చేస్తారు.

శరీరం పై రకరకాల కారణాల వలన ఏర్పడిన గాయాలను మాన్పుకోవటానికి జంతువుల కున్న ఏకైక సాధనం నాలుక. గాయాన్ని పదే పదే నాలుకతో నాకటం ద్వారా గాయం త్వరగా నయమౌతుంది. సంఘ జీవితం గడిపే జీవులలో తను స్వయంగా నాలుకతో శుభ్రం చేసుకోలేని ప్రదేశాలను గుంపులోని ఇతర జంతువులు శుభ్రం చేయటం గమనించే ఉంటారు. దీని వలన గాయంపై కీటకాలు పెట్టిన గ్రుడ్లను తొలగించటమే కాక, బ్యాక్టీరియా, వైరస్‌ల వంటి వాటికి వ్యతిరేకంగా లాలాజలాన్ని 'ఏంటీ బయోటిక్'గా జంతువులు ఉపయోగిస్తాయి. సంఘ జీవనం గడిపే జీవులను గుంపు నుండి వేరు చేసినపుడు వాటి శరీరం పై గాయాలు మానటానికి ఎక్కువ సమయం పట్టినట్లుగా శాస్త్రవేత్తలు గుర్తించారు.

స్వరపేటిక విడుదల చేసిన శబ్దాన్ని భాష రూపంలోకి మార్చే సాధనం నాలుక. భావం మనస్సుది, శబ్దం స్వరపేటికది. వ్యక్తం చేసేది నాలుక. అయినా మాటమారిస్తే నరం లేని నాలుక అంటూ నాలుకకే చెడ్డ పేరు ఆపాదిస్తాం. అలాగే ఎదుటి వ్యక్తికి ఆమోదయోగ్యంగా మాట్లాడి Sweet tongue అనే పేరూ తెచ్చుకుంది నాలుక. ఎదుటి వ్యక్తికి ఇబ్బంది కలిగేట్లుగా మాట్లాడి 'నోరా వీపుకు తేకే' అనే జాతీయాన్ని తనే స్వంతం చేసుకుంది.

ఎవరైనా తప్పు చేస్తే నాలుక మీద వాత పెడతానంటూ బెదిరిస్తుంటాం. దీని వలన నాలుకపై ఉండే Taste buds కాలిపోయి రుచి తెలియదు. రుచి పచి లేని ఆహారాన్ని ఎంతని తింటాం.

కొంచెం అతిశయోక్తి అనిపించినా భూమ్మీద వేలాది జీవ రాశులు విలుప్త (Extinct)మవటానికి కారణం నాలుకే. ఎలాగంటారా? నాలుక కోర్కెను తీర్చటం కోసం రోజూ లక్షలాది జీవులు చంపబడి, మనం జంతువులను చంపుతూ పోతే త్వరలో మిగిలిన జీవ జాతులు కూడా సమూలంగా నాశనమౌతాయి.

పర్యావరణ పరి రక్షణ దృష్ట్యా మనం, నొప్పి కలిగించని, ఎవరికీ కనబడని వాతలు మన నాలుకపై వేసుకోవాలి.

రెండు పనులు చేసే ఏ వస్తువు లేదా అవయవం విషయంలో జాగ్రత్తలు అవసరం. మరి అంత కంటే ఎక్కువ పనులు నిర్వహించే నాలుక విషయంలో మరిన్ని జాగ్రత్తలు అవసరం.

మూడంగుళాల పొడవు అంగుళం పైన వెడల్పు ఉన్న నాలుకను నిగ్రహించ గలిగితే మన శరీరమే కాదు. ప్రకృతి కూడా మనకు మరింత అందంగా కన్పిస్తుంది. సమాజంలో మనకు గౌరవమూ ఇనుమడిస్తుంది. మీరూ నాతో ఏకీభవిస్తారు కదూ!

*(''ఆకాశవాణి విజయవాడ కేంద్రం విజ్ఞాన జిజ్ఞాస శీర్షిక*
*క్రింద సెప్టెంబరు 2001లో ప్రసారం చేయబడిన ప్రసంగం''.)*

# సమసమాజంలో మానవాత్మ*

మూలం : ఆస్కార్ వైల్డ్ అనువాదం : సర్దేశాయి తిరుమల రావు

మనం ఇంకొకరి కోసం బ్రతుకడమనే అధ్వాన్నపు బాదర బందీ తప్పుటే సమసమాజ స్థాపన వలన కలిగే లాభం. ఇట్లు తప్పించుకో గలిగిన వాళ్లు అరుదు. డార్విన్ లాంటి గొప్ప శాస్త్రజ్ఞుడు, కీట్సు లాంటి గొప్ప కవి, రెనాన్‌గారి లాంటి మహా విమర్శకుడు, ఫ్లాబర్టులాంటి యుత్కృష్ట కళాకారుడు తమని తాము తెలిసికొని ప్రపంచానికి ప్రయోజనకారులయ్యే విషయాలను సాధించినారు. చాలా మంది ఇతరులకై చింతిస్తూ తమ బ్రతుకును చెడగొట్టుకుంటారు. వీళ్లు తమ చుట్టూ ఉన్న పేదరికమూ, అసహ్యమూ, ఆకలీ చూచి చలించి పోతారు. మంచి తలంపుతోనే తమ చుట్టూ ఉన్న చెడుగులను సవరించ వలెనని బాగా కృషి చేస్తారు. వారి చిట్కాలు రోగాలను కుదుర్చవు సరికదా రోగాలను ఎక్కువ చేస్తాయి. వారి చికిత్స రోగంలోని భాగమే.

ఉదాహరణకు, పేదరికమనే సమస్యా పరిష్కారం కోసం పేద వాళ్లు బ్రతకాలని పాటు పడతారు. ఉన్నతాశయాలుగల సైద్ధాంతికుల భావానుసారం పేదవాళ్లను మురిపించే పనులను చేస్తారు.

ఇది పరిష్కారం కాదు. ఇది పరిస్థితిని విషమింపజేయడమే. నిజమైన పరిష్కారం పేదరికం ఉండడానికే వీలు లేనట్టి ప్రాతిపదికపై సంఘాన్ని పునర్నిర్మించడమే. పరోపకార పరాయణత్వమనేది గొప్ప సుగుణం అనే భావం పై పరిష్కారం సాధ్యంకాకుండా చేస్తూవున్నది. బానిసలను దయతో చూసే కామందులే బానిస పద్ధతిలోని చెడ్డతనం బయటకు పొక్కకుండా చేసే దుర్మార్గులు. పేదవారికి ఉపకారం చేసేవాళ్ళే పేదవాళ్ళ శత్రువులు. దాన ధర్మాలు, వాటిని తీసికొనే వానిని కించపరుస్తాయి. వారిని అవినీతి పరులుగా చేస్తాయి. దానధర్మాలు పాప సమూహాన్ని సృష్టిస్తాయి. **

ఇదికూడా చెప్పవలసి ఉంది. స్వంత ఆస్తి వ్యవస్థ మూలకంగా సంభవించే దురాగతాలను నిర్మాలించేందుకు స్వంత ఆస్తిని వాడడం నీతి విరుద్ధం, అనుచితం.

---

* ఆస్కార్ వైల్డ్ వ్యాసం "The Soul of Man under Socialism" (1895)కు వాక్యాల వారీ తెలుగనువాదం. "Socialism" అన్న పదాన్ని ''సమసమాజం'' అనీ, Individualism అన్న పదాన్ని ''వ్యక్తిత్వం'' అని అనువదించినాను.

** సత్యయుగంలో దాన మిచ్చేవాడు లేడట. దానం తీసుకొనే వాడు లేడట. త్రేతలో ఎవడన్నా దానం తీసుకొమ్మని ఇంకొకని దగ్గరకు పోయి అడిగితే, ఆ ఇంకొకడు దానం వద్దుపో అంటాడట. ద్వాపరలో ఎవడన్నా దానమిస్తే ఇంకొకడు పుచ్చుకుంటాడట. కలిలో గ్రహీతయే ఇంకొకని దగ్గరకు పోయి అయ్యా దాన మిస్తావా? అని యాచిస్తాడట. యుగ క్షీణతకూ దాన విజృంభణకూ లంకె, వైల్డ్ సిద్ధాంతాన్ని బలపరుస్తున్నది.

---

కీ॥ శే॥ డా॥ సర్దేశాయి తిరుమలరావు, (1928 - 1994) ప్రముఖ సాహిత్య విమర్శకులు

సమసమాజంలో ఇదంతా మారుతుంది. అసహ్య పరిసరాల్లో కంపు కొట్టే కొంపలలో మురికి బట్టలు తొడిగికొని అనారోగ్యంతోనూ, ఆకలితోనూ అలమటించి పోయే పిల్లలను కని, పెంచే వాళ్ళుండరు. ఇప్పటి మాదిరి సంఘ క్షేమం, వాతావరణ పరిస్థితిపైనాధారపడి యుండదు. ఇప్పుడెట్లా ఉంది. మంచు కురిసింది అనుకొండి. లక్షమందికి ఉపాధిపోతుంది. వీరు బజారు వెంబడి తిండిలేక తిరుగుతూ అడుక్కు తినడం మొదలుపెడ్తారు. పొరుగింటివాని ఇంట్లో ఒక మకిలి మూల నక్కుకొనుటకు ప్రయత్నిస్తున్నారు. సమసమాజంలో ప్రతి వ్యక్తీ సంఘం యొక్క సంపత్సమృద్ధిలో భాగం పంచుకొంటాడు. మంచు కురిస్తే ఎవడూ నష్టపోడు.

సమ సమాజం ఇంకొక విధంగా కూడా మూల్యవంతమైంది. అది వ్యక్తిత్వ వాదానికి దారితీస్తుంది.

సోషలిజం అనండి, కమ్యూనిజం అనండి స్వంత ఆస్తిని సమష్టి ధనంగా మారుస్తూంది. పోటీకి బదులు సహకారాన్ని తెస్తుంది. తన్మూలంగా సంఘాన్ని ఆరోగ్యకర జీవిగా మారుస్తుంది. సమాజంలోని ప్రతి వ్యక్తి యోగ క్షేమానికి హామీ ఇస్తుంది. జీవితానికి తగు అధారాన్నీ, అనుకూల పరిసరాన్ని కల్గిస్తుంది. జీవిత పరమావధిని సాధించేందుకు వ్యక్తిత్వం అవసరం. సోషలిజం మిష క్రింద పారిశ్రామిక నియంతృత్వం పరిస్థితి ఇప్పుడున్న దానికంటే నికృష్టమవుతుంది. ఇప్పటి స్వంత ఆస్తి వ్యవస్థలో, చాలా కొద్ది మంది మాత్రమే తమ వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసికోగలుగుతున్నారు. వీరు ఎటువంటి వారంటే, తమ జీవన భృతికి పనిచేయనక్కరలేని వాళ్ళో లేక తమ కిష్టమైన వ్యాపృత్తిలో నిమగ్నమయిన వాళ్ళో. వీరే కవులు, తాత్వికులు, శాస్త్రజ్ఞులు, సంస్కృతీపరులు - నిజమైన మనుషులు, తమను తాము తెలుసుకొన్నవాళ్లు, మానవ లోకానికంతా కొంతైనా విజ్ఞత కలిగించేవాళ్ళు. వీళ్ళ సంగతి ఇట్లుండగా, ఎక్కువ సంఖ్యలోని వాళ్ళగతి విచారిద్దాము. వీరికి ఆస్తి వుండదు. వీరు ఎప్పుడూ ఆకటితో అలమటిస్తూంటారు. పసరాల మాదిరి పనిచేస్తుంటారు. లేమి మూలకంగా నచ్చని, నీచమైన పనిచేయడం వీరికి తప్పడం లేదు. వీరే పేదలు. వీరిలో చక్కందనం వుండదు. నాగరికత లేదు. సంస్కృతి లేదు. బ్రతుకులో సంతసం లేదు. వీరి సమష్టి శ్రమ వల్లనే మానవాళికి భోగభాగ్యాలు కల్గుతున్నాయి. కాని పేదవాడు దేనికీ కొఱగాని వాడు. వీనిని ఉద్ధరించే బదులు ఒకానొక శక్తి వీనిని నలుసు వలె నలిపి వేస్తుంది. వీడు నక్కి పడివుండవలెను. ఆస్థితిలో వాడు ఎక్కువ విధేయతతో ఉంటాడు.

స్వంత ఆస్తి వ్యవస్థలో కనిపించే వ్యక్తిత్వమేమంత అద్భుతమైంది కాదు. పేదవారికి పైపై మెరుగులు, చమక్కులు లేక పోవచ్చు కాని అనేక సుగుణాలు లేకపోలేదు అనవచ్చును. ఈ రెండు అభిప్రాయాలూ సరియైనవే. స్వంత ఆస్తి కలిగి వుండడమే అవినీతికి దారి తీస్తుంది. ఈ కారణం చేతనే సమసమాజం స్వంత ఆస్తి విధానానికి స్వస్తి చెప్పబూనుతుంది. ఆస్తి అనేదే ఒక పెద్ద బాదర బంది. ఆస్తికి

విధులున్నాయట. నిజమేననిపిస్తుంది. ఆస్తిని కలిగి వుండడమే చెడ్డ విసుగుగా పరిణమిస్తుంది. ఎప్పుడూ దాని విషయమే ఆలోచిస్తూవుండవలెను. ఆస్తి అంటే కేవలం ఆనందమే అయితే ఏదో పోనీ అని ఉండనివ్వవచ్చు. దాని విధులవల్ల అది సహింపరానిదవుతుంది. ధనికుల మీది కనికరముతోనైనా మనం ఆస్తి వ్యవస్థకు తలవాకిలి చూపించవలె. ఇక పేదవారి సుగుణము లందామా? అని వున్నాయని ఎంత శోచిస్తూ అయినా ఒప్పుకుందాము. పేదలు దానధర్మాలకు కృతజ్ఞులుగా ఉంటారని చెబుతారు. కొందరు కృతజ్ఞులే కావచ్చును. కాని పేదవాళ్ళు కృతజ్ఞులు కారే? వీళ్ళు కృతఘ్నులు, అసంతృప్తులు, వినయహీనులు, తిరుగుబాటుదారులు. అట్లుండుటకు వారికి హక్కుంది. తమ జీవితాలపై పెత్తనం చెలాయించేందుకు దయాళు వొకడు చేసే ప్రయత్నమే దానం అని వీరి భావన. షావుకారు పడవేసే ముద్దలకు కృతజ్ఞత చూపించవలెనా? వాళ్ళూ, సహపంక్తిలో కూర్చోగలగవలె. ఇక అసంతృప్తి అందామా? అటువంటి నికృష్ట జీవనంతో అసంతృప్తి చెందనివాణ్ణి పసరమే అనవలె. చరిత్ర బాగా తెలిసిన వాళ్ళకి అవిధేయత అనేది ఆదిమ సుగుణం అనేది సువిదితం కాగలదు.* అవిధేయత, తిరుగుబాటు మూలముననే ప్రగతి సాధింపబడ్డది. పేదవారి ఇంకొక సుగుణం పొదుపంటారు. పేదవారిని పొదుపు చేయండని చెప్పుట అసహ్యకరమూ, అవమానకరమూ కూడాను. ఆకలిగొన్న వానిని మితంగా తినుమని చెప్పినట్లుంది. మేత పెట్టని పశువువలె బ్రతుకడానికి ఏమనిషీ ఒప్పుకోకూడదు. దొంగతనమైనా చేయవలె, బాకీ అయినా, పెట్టవలె. బాకీ కంటే బిచ్చం భద్రం. ఇదంతా అయ్యేది కాదు. కృతఘ్నత, దుబారా, అసంతృప్తి, తిరుగుబాటు చూపే పేదవాడే నిజమైన మనిషి. అంటే వానిలో ఏదో సత్తా వుందని లెక్క. ఇక సుగుణాలు కలిగిన పేదవారంటారా? వారిని చూస్తేనే జాలి వేస్తుంది కాని మెచ్చుకోలేము. వీళ్ళు శత్రువుతో రహస్యపు ఒడంబడికను చేసుకొన్న వాళ్లు. తమ జన్మ హక్కును పిడికెడు కూటికి అమ్ముకొన్న నిర్భాగ్యులు. తమకు లాభించేటట్లయితే స్వంత ఆస్తి చట్టాన్ని ఒప్పుకోవడాన్ని అర్థం చేసుకోగలను. కానీ తమ బ్రతుకును చట్టుబండలుచేసే చట్టాలను మనిషి ఎలా ఒప్పుకొన్నాడు. ఎలా భరిస్తున్నాడనేది నాకంతు బట్టలేదు.

దీనిని వివరించేదంత కష్టమేమీ కాదు. అది ఇది. దైన్యమూ, దారిద్ర్యమూ, మానవ ప్రకృతిని పూర్తిగా అస్తవ్యస్తం చేస్తాయి. వాటి ఫలితంగా మనుష్యులు స్వాధీనం తప్పి వారి దుస్థితిని వారే పసికట్టలేరు. ఎవరన్నా చెప్పవలసి వుంటుంది. ఒకవేళ చెప్పినా నమ్మరు. పారిశ్రామిక పెత్తలు కార్మికులకు తిరుగుబాటు గురించి చెప్పేది పూర్తిగా నిజం. ఈ తిరుగు బాటు దార్లెవరు? విరామ వర్గం నుంచి వచ్చి ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకొనుచూ కార్మికులలో అసంతృప్తిని రేపేవాళ్ళు. అందుకే

* ఇచట వైల్డ్ తన సహజమైన విరోధాభాస శైలి వ్రాస్తున్నాడు. అవిధేయత అనేది అదిమ పాపం. ఆదిమానవుడు ఆదం భగవదాజ్ఞ జవదాటి, అవిధేయతతో ప్రవర్తించి, పతనానికి కారణమైనాడు. ఆదాం అవిధేయతను క్రైస్తవులు ఆదిమ పాపం అంటుండగా, వైల్డ్ ఆదిమ సుగుణం అంటాడు.

తిరుగు బాటుదార్ల అవశ్యకత అంత ఉండుట. వీరే లేకుంటే నాగరికత వైపు పురోభివృద్ధే వుండదు. అమెరికాలో బానిసత్వం అణచివేయబడడానికి కారణం బానిసల ఉద్యమం కాదు. బానిసత్వం, బానిసలు కాని వారూ, బానిసల కామందులు కానివారూ అయినటువంటి కొందఱు తిరుగుబాటు దారులు బోస్టను మరియూ ఇతర చోట్లు చేసిన చట్ట విరుద్ధ చర్యల మూలముననే బానిసత్వ నిర్మూలన సంభవమయింది. దాస్య బహిష్కరణ వాదులు వెలిగించిన కాగడా అది. వీరికి బానిసల నుంచి సహాయం కానీ, సాను భూతికానీ లభించకపోవడం విడ్డూరంగా ఉందికదూ? అమెరికా అంతర్యుద్ధం ముగిసిన తర్వాత బానిసలు తాము స్వేచ్ఛను కలిగినట్లు గుర్తుకు తెచ్చికొన్నారు. ఎంత స్వేచ్ఛ అంటే పస్తుండి చచ్చేటంత స్వేచ్ఛ. ఈ స్వేచ్ఛ ఎందుకన్నా వచ్చిందిరా అని వగచినారు. ఆలోచనా పరులకు ఫ్రెంచి విప్లవంలో విషాదకర విషయం ఏమంటే, మేరీ అంటొనెటీ అనే రాణి చంపబడడంకాదు. ఆకలితో చస్తూన్న ''వెండీ*'' రైతూ, పైశాచిక భూస్వామ్య పద్ధతికోసం ప్రాణాలిచ్చుటకు సిద్ధపడటమే.

వ్యక్తి స్వాతంత్ర్య వ్యతిరేకమైన సమసమాజం వద్దు అనేది స్పష్టం. ఇప్పటి వ్యవస్థలో చాలమంది కొద్దిపాటి స్వాతంత్ర్యమైనా కలిగి సుఖిస్తున్నారు. పారిశ్రామిక బారకాసు విధానంలో, ఆర్థిక నిరంకుశత్వ విధానంలో ఈ మాత్రమైనా స్వాతంత్ర్య సంతోషం లుండవు. ప్రతి మనిషీ తనపనిని తానే ఎన్నుకొనుటకు స్వతంత్రుడై వుండవలె. ఏ విధమైన బలవంతమూ ఉండరాదు. ఉంటే ఆ పని వానికి మంచిదికాదు. ఆపనికీ మంచిది కాదు. వేఱేవాళ్ళకూ మంచిది కాదు. ఏదో ఒకటి చేస్తూవుండడమే పనియని నా నిర్వచనం.

పర్యవేక్షకుడు రోజూ ఇంటింటికి తనిఖీకి పోయి ప్రతి మనిషి ఎనిమిది గంటలు కాయకష్టం చేస్తున్నాడా లేడా అనే పద్ధతిని ఈనాడు ఏ సమసమాజ వాదీ ప్రతిపాదించడు. మానవాళి ఆదశను దాటిపోయింది. ఆధార రహితంగా నేరస్థులు అని పిల్వబడేవారి ఎడల మాత్రమే ఈ పద్ధతి అమలుపరచబడుతూ ఉంది. నాకనిపించేదేమంటే, కొన్ని సమసమాజ, భావాలింకా అధికారత్వంలో కలుషితమై వున్నాయి అని. అధికారం, బలవంతుల ప్రశ్నేలేదు. సంబంధాలన్నీ ఐచ్ఛికంగా వుండవలె. ఐచ్ఛిక సంబంధాలలోనే మనిషి స్పష్టనంగా ఉండడు. ఆస్తిమీద ఆధారపడిన వ్యక్తిత్వానికి ఆస్తిని బహిష్కరించే దానివల్ల ఒరిగేదేమి అని అడుగుతారా? ఉత్తరం సులువు. ప్రస్తుత పరిస్థితుల్లో స్వంత ఆస్తివున్న బైరను, షెల్లే, బ్రౌనింగు, విక్టరు యూగో, బోదలేరు మున్నగు వాళ్లు తమ వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసికోగలిగినారు. వీళ్లు ఒక్కరోజు కూడా జీతానికి చాకిరీ చేయలేదు. వారికి దారిద్ర్యపు బెడద వుండలేదు. ఎంతో సౌకర్య పరిస్థితి వుండేది. వ్యక్తిత్వం కోసం ఈ సౌకర్యాన్ని తీసి

* రాచరికాన్ని బలపరచే పశ్చిమ ఫ్రాన్సులోని వెండీ అనే ప్రాంతం.

వేయవలెనా? తీసివేయ బడ్డది అనుకుందాము. అపుడు వ్యక్తిత్వం గతి ఏమవుతుంది? అదే విధంగా లాభిస్తుంది?

ఈ విధంగా లాభిస్తుంది. కొత్త పరిస్థితులలో వ్యక్తిత్వం ఇప్పుడున్నంతకంటే, ఎక్కువ స్వేచ్ఛగా, సౌష్టవంగా, గాఢం ఉంటుంది. తమ వ్యక్తిత్వాన్ని భావస్ఫోరకంగా అభివృద్ధిచేసికొన్న పైన చెప్పిన కవుల వ్యక్తిత్వం గురించికాదు నేను చెబుతుండేది. మానవాళిలో నిద్రాణమైయున్న వ్యక్తిత్వం గుఱించి మాట్లాడుతున్నాను. ఆస్తికి ఇచ్చిన గుర్తింపు వ్యక్తిత్వానికి చాలా చెడుగు చేసింది. మనిషికి, వాడు కలిగివుండే ఆస్తికీ భేదమే లేకుండా పోయింది. ఆస్తి వ్యక్తిత్వాన్ని దారి తప్పించింది. లాభమే ముఖ్యమైంది. అభివృద్ధి మఱుపబడింది. మనిషి ఆస్తి కలిగివుండడమే ప్రధానమనుకొనుచున్నాడు. వ్యక్తిగా ఉండడం వానికి పట్ట లేదు. ఒకని పరిపూర్ణత్వం అనేది వాడేమికలిగి వున్నాడనే దాని మీద కాక వాడేమిగా వున్నాడనే దాని మీదనే ఆధారపడియుంది. స్వంత ఆస్తి నిజమైన వ్యక్తిత్వాన్ని అణచివేసింది. తప్పుడు వ్యక్తిత్వాన్ని రేకెత్తింది. సమాజంలో ఒక భాగం యొక్క వ్యక్తిత్వాన్ని ఆకలితో అంతమొందిస్తున్నది. ఇంకొక భాగం యొక్క వ్యక్తిత్వాన్ని బాదరబంది కల్పించి దారి తప్పిస్తూవుంది. మనిషి వ్యక్తిత్వమంతా ఆస్తి వ్యవహారాల్లోనే సతమతమయిపోతూవుంది. ఇంగ్లాండు దేశపు చట్టంలో మనిషిమీద జరిగిన అఘాయిత్వానికి కంటే, ఆస్తి విషయంలో చేసిన నేరాలకే ఎక్కువ కఠిన శిక్షలు విధింపబడినాయి. ఇప్పటికీ స్వంత ఆస్తే పౌరసత్వ హక్కుకు మూలం. * ఆస్తి, హోదా, మర్యాద, బిరుదులు, ప్రతిపత్తి, భోగభాగ్యాలు ఇవ్వగలదు కాబట్టే దాన్ని కూడబెట్టేందుకే మనిషి పాటుపడతాడు. అదే ఒక వ్యసనమై ఆస్తిని సంపాదిస్తూనే ఉంటాడు. తనకు కావలసిన దానికంటే ఎక్కువ వున్నాసరే. అతని ఆస్తి ఎంతవుందో అతనికే తెలియనంత సంపాదిస్తాడు. ఆస్తికోసం మనిషి చచ్చేటట్లు పనిచేస్తాడు. ఆస్తివల్ల కలిగే ప్రయోజనాల దృష్ట్యా ఇదేమి ఆశ్చర్యం కాదు.

మనిషి తనలోని అద్భుతమైన, వ్యామోహకమైన ఆనంద దాయకమైన శక్తులను స్వేచ్ఛగా పెంపొందింప జేసికొనే బదులు ఆస్తి సంపాదన అనే గాట్లో తిరిగేటట్లు, దాపురించిన సమాజాన్ని ఏమనగలం? దీనివల్ల వానికి, బ్రతుకులోవుండే నిజమైన ఆనందం లేకుండా పోతూవుంది. పోని భద్రతన్నా ఉందా అంటే అదీ లేదు. అధిక ధనవంతుడైన వ్యాపారి కూడ ప్రతి క్షణము తన స్వాధీనంలో లేని శక్తుల దయా దాక్షిణ్యాలపై నాధారపడియుంటాడు. గాలి కొంచెం ఎక్కువ వీచిన దనుకోండి. వాతావరణం మారిందను కోండి. వాని నావ మునిగిపోవచ్చు. వాని వ్యాపార ప్రణాళికలు తప్పు పోవచ్చు. వాడు

* మన దేశంలో కూడ బ్రిటిషువారి హయాంలో జిల్లా బోర్డుల్లాంటి వాటికి జరిగి ఎన్నికలలో ఆస్తివున్న వాళ్ళకే వోటు వేసేందుకు హక్కు ఉండేది. సార్వత్రిక ఓటు హక్కు తర్వాత వచ్చింది.

దివాలా తీస్తాడు. వాని ప్రతిపత్తి పోతుంది. మనిషిని ఏదీ హానిపరచేదిగా వుండరాదు. ఏదీ కూడా మనిషిని దొంగలించేటట్లు ఉండరాదు. మనిషిలో వుండేదే మనిషికుండేది. మనిషికి బయట వుండేదానికి ప్రాముఖ్యం ఉండకూడదు.

స్వంత ఆస్తి బహిష్కారంతో నిజమైన, సుందరమైన, ఆరోగ్యకరమైన వ్యక్తిత్వం లభిస్తుంది. ఎవడు కూడా కూడబెట్టుకొనేందకు బ్రతుకును వృధాచేయడు. మనిషి జీవిస్తాడు. బ్రతుకడమే మిక్కిలి అరుదైన విషయం. చాలా మంది ఈసురోమని పడివుంటారు అంతే.

వ్యక్తిత్వ పరిపూర్ణత కళా కాల్పనిక స్థాయిలో తప్ప వేరేచోట చూచినామా అనేది ప్రశ్న. ఆచరణలో చూడలేదు. సీజరు పరిపూర్ణ ఆదర్శ మానవుడంటాడు మోంసెన్. * కానీ సీజరుకు భద్రతవుండలేదు. అధికారాన్ని చెలాయించేవాడున్నచోట, అధికారాన్ని ఎదిరించేవాడూ వుంటాడు. మార్కస్ అరీలియస్ పరిపూర్ణ మానవుడంటాడు రెనాన్.** కానీ అగీలియస్ రోమక సామ్రాజ్య భారంతో క్రుంగి పోతాడు. వీళ్లదంతా పరిపూర్ణత కాదు. ఆదర్శ పరిస్థితులలో వికసించిన వాడే పరిపూర్ణ మానవుడు. ఎవనికి గాయాలు తగులవో, చీకు చింతలుండవో, అంగ వికలత్వంరాదో అపాయం రాదోవాడే పరిపూర్ణుడు. గొప్ప వాళ్లు చాలామంది తిరుగు బాటుదారులు కావలసి వచ్చింది. వీరి బ్రదుకులో సగానికి సగం రాపిడిలో వృథా అయి పోయింది. బైరను *** వ్యక్తిత్వమంతా ఇంగ్లీషువారి అవివేకంతోనూ, డంబాచారంతోనూ, నీచాభిరుచితోనూ పోరాడడానికే వ్యర్థమై పోయింది. ఇటువంటి ఘర్షణలు వ్యక్తిశక్తిని ఎక్కువ చేయవు. వ్యక్తిగత లోపాలను చిలువలు పలువులుగా చేస్తాయి. అందుకే బైరను మనకివ్వగలిగినంత ఇవ్వలేకపోయినాడు. షెల్లీ ఎలాగో తప్పించుకొన్నాడు. **** బైరనువలె ఇతడూ దేశం విడిచిపోయాడు. కానీ అంతప్రసిద్ధుడు కాడు. షెల్లీయే కనుక అంత గొప్ప కవి అని ఇంగ్లీషు వాళ్లకి తెలిసివుంటేనా, వాళ్ళు ఆయన మీదపడి, రక్కి, కొరికి, ఆయన జీవితాన్ని దుర్భరం చేసివుండే వాళ్లే. సంఘంలో ఇతనికి సముచిత స్థానం ఉండలేదు కాబట్టి బ్రతికి పోయినాడు.***** అయినా షెల్లీలో కూడ తిరుగుబాటు తత్వం అప్పుడప్పుడు పుంజుకుంటూ ఉండేది. వ్యక్తిత్వ పరిపూర్ణతకి గుర్తు పితూరీకాదు. ప్రశాంతి.

(సశేషం)

* మోంసెన్ ''రోమన్ చరిత్ర'' కు నోబెల్ బహుమానం వచ్చింది

** రెనాన్ ఫ్రెంచి మేధావి. క్రీస్తు చరిత్రవ్రాసినాడు.

*** రొమాంటిక్ ఉద్యమానికి చెందిన ప్రముఖ కవి.


**** షెల్లీ రొమాంటిక్ ఉద్యమానికి చెందినకవి. ఇంగ్లీషు భాషా సాహిత్యంలోని ధ్రువతార

***** బైరను ప్రభు వంశీకుడు. షెల్లీ సామాన్య కుటుంబంలోని వాడు.



కళాకారుడు సూర్యప్రకాశ్ భూమిని వలిచాడు, దానినొక ప్రేమ మూర్తిగా, ఆనందాను భూతిగా, విశ్వాసానికి ప్రాతిపదికగా, అతనిని పరివేష్టించి ఉన్న అందాల రంగుల ఛాయను, తన ప్రతి కాన్వాసు మీద పులిమాడు ఒక శ్రద్ధాంజలిగా, కృతజ్ఞతాభివ్యక్తిగా. సంతోషం, సృజనశక్తులు (సర్జకశక్తి) వరాలుగా పొందిపుట్టిన ఆత్మలను అలంకరించడానికి వచ్చిన కలలా ఈయన చిత్రాలు అనిపించేట్టుగా ఉంటాయి.

MISIMI/ మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd.No.H/SD-191/20



గుప్త భాషా మార్మికతలు